



SHIVA SURYA TELUGU DAILY

# శివసూర్య

RNI APTEL : 2023/88704

తెలుగు దిన పత్రిక





**శివసూర్య**

**విలేకర్లు కావలెను**

కర్నూలు జిల్లా, నంద్యాల జిల్లాల నుండి విడుదలవుతున్న సంచలన సమాచార దినపత్రిక శివసూర్య తెలుగు దినపత్రికలో పని చేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్సీ ఇంచార్జ్‌లు & మండల విలేకర్లు కావలెను.

**ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.**

ఎడిటర్ : బి. శివరాముడు

9494741301, 9346185399.



కర్నూలు సంపుటి : 03, సంచిక : 270 చీఫ్ ఎడిటర్.. పేజీలు : 08, వెల రూ. 2రూ/ బుధవారం - 10 - జూన్ - 2026

Published From Kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad





**'మమ్మల్ని కాదు, ఫ్యాక్టరీని కాపాడండి'.. క్షతగాత్రుడి మాటలతో కదిలిపోయాను**

- విశాఖ స్టీల్ ప్లాంట్ లో ఘోర ప్రమాదం
- విశాఖలో మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శించిన లోకేష్
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, శాశ్వత ఉద్యోగం హామీ
- కేంద్ర మంత్రి కుమారస్వామి, రాష్ట్ర మంత్రి లోకేష్ పరామర్శ
- ప్రమాద కారణాలపై ముగ్గురు సభ్యులతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు

# బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ

**విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదం.. ఆర్థిక సాయం వివరాలు ప్రకటించిన పవన్ కళ్యాణ్**

- విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద స్థలాన్ని పవన్ పరిశీలన
- కిమ్స్ ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన డిప్యూటీ సీఎం
- నిపుణుల కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు
- త్వరలో కార్మికుల సమస్యలపై సమావేశం నిర్వహిస్తానని వెల్లడి



విశాఖపట్నం: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖకు చేరుకున్న ఆయన కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మిగతా 2 లో

**స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రల వల్లే ప్రమాదాలు: బొత్స సత్యనారాయణ**

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో ఎనిమిది మంది చనిపోవడం బాధాకరమన్న బొత్స




బాధితులు కోరుతున్న పరిహారం ఇవ్వాలని వ్యాఖ్య

మృతుల కుటుంబాలకు కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్




రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు

## సీఎం చంద్రబాబు

**జూన్ 10, 11 తేదీలో దేశ రాజధానిలోనే బస**

- రెండు రోజుల పర్యటన నిమిత్తం నేడు ఢిల్లీకి వెళ్లనున్న సీఎం
- తొలి రోజు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశానికి హాజరు

అమరావతి: సీఎం చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటన నిమిత్తం దేశ రాజధాని ఢిల్లీకి వెళ్లనున్నారు. నేడు, రేపు, ఆయన ఢిల్లీలో పలు కీలక సమావేశాల్లో పాల్గొంటారు. ఈ పర్యటనలో భాగంగా ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశం, నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి హాజరు కానున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ఉదయం 11:30 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరుతారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి మిగతా 2 లో

## కేసీఆర్, భాజపా నేతలకు

# సీఎం రేవంత్‌రెడ్డి సవాల్

**అసెంబ్లీకి రండి.. చర్చిద్దాం నాలుగు రోజులు చర్చపెట్టి వివరిస్తా"**

- ★ 'రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు కూడా గెలిస్తేనే కేంద్రంలో మోదీ ప్రధాని అయ్యారు
- ★ లక్ష ఎల్ఐజీ, ఎంఐజీ గృహాలను నిర్మించేందర్నకు ప్రణాళిక సిద్ధం
- ★ మంత్రి పొంగులేటి త్వరలో పథకాన్ని ప్రకటిస్తారు
- ★ ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి స్వాధీనం చేసుకుంటున్నాం



హైదరాబాద్: "పదే పదే రాష్ట్రానికి నువ్వేం చేశావని నన్ను అడుగుతున్నారు.. పదేళ్లు సీఎంగా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఇప్పుడు ఫాంహౌస్‌లో ఉన్నారు. పన్నెండేళ్లుగా మోదీ ప్రధానమంత్రి. రెండేళ్లలోనే ఏం చేయలేదని నన్ను అడుగుతున్నారు కదా. అసెంబ్లీకి రండి.. చర్చిద్దాం. మిగతా 2 లో




**ధాన్యం పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయం చేస్తున్నారు**

- కేంద్రం మొత్తం పంట సేకరిస్తే ఆ వడ్లను ఏం చేయాలి? ఆ డబ్బు ప్రజలదే కదా?
- 2028లో అధికారంలోకి వస్తాం.. సింగరేణి ఉద్యోగులకు ఐటీ చెల్లింపులు రీయింబర్స్ చేస్తాం
- డీఎంఎఫ్ నిధుల్ని దారి మళ్లించిన భారాస, కాంగ్రెస్ ప్రభుత్వాలు
- క్రిటికల్ మినరల్స్ నుంచి కోల్ గ్యాసిఫికేషన్ వరకు



**రాష్ట్ర కేబినెట్ రోజుకు 18 గంటలు**

## ప్రజల కోసం పనిచేస్తోంది

**మేము 18 గంటలు కష్టపడుతుంటే.. హరీష్ రావు అబద్ధాలు చెబుతున్నారు: భట్టి విక్రమార్క**

- బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని దివాలా తీయించిందని మండిపాటు
- తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 76 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని వెల్లడి

హైదరాబాద్: తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బీఆర్ఎస్ నాయకులపై, ముఖ్యంగా మాజీ మంత్రి హరీష్ రావుపై మిగతా 2 లో

**దశాబ్దాల విధానానికి స్వస్తి.. అణుబాంబులను మోహరించిన భారత్!**

12 అణ్వస్త్రాలను ప్రయోగానికి సిద్ధంగా ఉంచిన భారత్





సిప్రి నివేదికలో సంచలన విషయాలు

భారత్ వద్ద దాదాపు 190 అణు బాంబులు

కంటైనర్లలో సిద్ధంగా ఉంచే సాంకేతికతతోనే సాధ్యం

**నేడు విశాఖకు జగన్.. స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులకు పరామర్శ**

- విశాఖ స్టీల్ ప్లాంట్ లో ఘోర ప్రమాదం
- ఎనిమిది మంది కార్మికుల దుర్మరణం
- ఘటనపై ఇప్పటికే తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన జగన్
- బాధిత కుటుంబాలకు అండగా నిలవాలి



అవరావతి: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని రేకెత్తించింది. ఈ దారుణ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలను, అలాగే గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న మిగతా 2 లో

**పశ్చిమ బెంగాల్‌లో పార్టీలో సంక్షోభం.. తృణమూల్ కాంగ్రెస్ ఏమన్నదంటే?**

**మమత నాయకత్వాన్ని పొగిడినవారే, ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన**

ఇది అధికారం కోసం చేస్తున్న ద్రోహమని టీఎంసీ చీఫ్ విప్ వ్యాఖ్య

తృణమూల్ కాంగ్రెస్‌లో తీవ్రమైన అంతర్గత సంక్షోభం

ఎన్డీఏకు మద్దతిస్తామంటూ 20 మంది ఎంపీల తిరుగుబాటు



ఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో ప్రస్తుత పరిణామాలపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) స్పందించింది. టీఎంసీ చీఫ్ విప్‌గా నియమితులైన కల్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ, గతంలో మమతా బెనర్జీ నాయకత్వాన్ని ఆకాశనికెత్తిన వారే, ఇప్పుడు పార్టీ అధికారంలో లేదనే మిగతా 2 లో

## దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి

## రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్



అభద్రతా భావంతో రేవంత్ వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారన్న కిషన్ రెడ్డి

రాష్ట్ర అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులపై చర్చకు రావాలని సవాల్

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే మిగతా 2 లో

**తెలంగాణకు భారీ వర్ష సూచన.. హైదరాబాద్‌లో మొదలైన వాన జోరు**




- రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం
- గంటకు 40 నుంచి 50కి.మీ వేగంతో ఈదురుగాలులతో వర్షాలు

# పీఓకేలో రక్తపాతం.. పాక్‌పై అంతర్జాతీయ సమాజం చర్యలు తీసుకోవాలి: భారత్

ఢిల్లీ: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లోని రావల్‌కోట్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘర్షణల్లో పౌరులు మరణించడంపై భారత్ తీవ్రంగా స్పందించింది. నిరసనకారులపై పాకిస్థాన్ సాగించిన అణచివేత చర్యలకు గానూ, ఆ దేశాన్ని అంతర్జాతీయ సమాజం జవాబుదారీని చేయాలని ఆశిస్తున్నట్లు భారత్ మంగళవారం పేర్కొంది. జూన్ 7, 8 తేదీల్లో రావల్‌కోట్‌లో భద్రతా బలగాలకు, జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) మద్దతుదారులకు మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణలు జరిగాయి. ఈ హింసాకాండలో ఆరుగురు నిరసనకారులు, నలుగురు పోలీసులు, ఒక సామాన్య పౌరుడితో సహా 30 మంది మరణించగా, 200 మందికి పైగా గాయపడ్డారు.

అసలేం జరిగింది?

సరసమైన ధరలకు గోధుమ పిండి, విద్యుత్ సరఫరా చేయాలని, రాజకీయ హక్కులు కల్పించడంతో పాటు తమ ప్రాంతంపై చూపుతున్న వివక్షను అంతం చేయాలని డిమాండ్ చేస్తూ జేఏఏసీ అనే పౌర సమాజ కూటమి ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే నిరసనలు ఉద్రిక్తంగా మారి హింసకు దారితీశాయి. నిరసనకారులే ముందుగా కాల్పులు జరిపారని, అందుకే తాము ఆత్మరక్షణ కోసం స్పందించాల్సి వచ్చిందని పాకిస్థాన్ అధికారులు చెబుతున్నారు. అయితే, భద్రతా బలగాలే తమపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి ఊచకోతకు పాల్పడ్డాయని జేఏఏసీ నేతలు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియాలో మృతుల సంఖ్య 150 నుంచి 200 వరకు ఉండవచ్చని వదంతులు వ్యాపిస్తున్నప్పటికీ, ప్రభుత్వం కమ్యూనికేషన్ వ్యవస్థలపై ఆంక్షలు విధించడంతో వాస్తవాలను ధృవీకరించడం కష్టంగా మారింది. ఈ ఘటనపై బ్రిటన్‌లోని ప్రవాస కశ్మీరీలు పాకిస్థాన్ కాన్సులేట్ వద్ద నిరసనలు చేపట్టారు. ప్రస్తుతం పీఓకేలో బంద్ కొనసాగుతుండగా, ముజఫరాబాద్, భీంబర్, మీర్‌పూర్ వంటి ప్రాంతాల్లో పరిస్థితులు ఇంకా ఉద్రిక్తంగానే ఉన్నాయి.

# నేడు విశాఖకు జగన్.. స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులకు పరామర్శ

అవరావతి: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని రేకెత్తించింది. ఈ దారుణ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలను, అలాగే గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించేందుకు వైసీపీ అధినేత జగన్ నేడు విశాఖలో పర్యటించనున్నారు. ఈ ప్రమాదంపై జగన్ ఇప్పటికే తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఘటన జరిగిన వెంటనే ఆయన స్పందిస్తూ... బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందేలా చూడాలని స్థానిక వైసీపీ నాయకులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు తన గాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు పార్టీ శ్రేణులు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని సూచించారు. సోమవారం సాయంత్రం స్టీల్‌ప్లాంట్‌లో ఒక పెద్ద పేలుడు సంభవించింది. 150 టన్నుల లాడిల్ నుండి కరిగిన ఉక్కు ఒక్కసారిగా కిందపడటంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా... మరో ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వారు నగరంలోని వివిధ ఆసుపత్రుల్లో అత్యవసర చికిత్స పొందుతున్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం.

# 'మమ్మల్ని కాదు, ఫ్యాక్టరీని కాపాడండి'.. క్షతగాత్రుడి మాటలతో కదిలిపోయాను

ఢిల్లీ: విశాఖ స్టీల్ ప్లాంట్‌లో చోటుచేసుకున్న ఘోర ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు, క్షతగాత్రులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. బాధితులను పరామర్శించిన అనంతరం నారా లోకేష్ మీడియాతో మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం కల్పిస్తున్న భరోసాను వివరించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా, కాంట్రాక్ట్ లేదా పర్మనెంట్ అనే తేడా లేకుండా మృతుల కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పిస్తామని ప్రకటించారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ప్రకటించిన వివరాలను లోకేష్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తరపున అదనంగా రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రతి కుటుంబానికి అందిస్తున్నట్లు తెలిపారు. నిన్న రాత్రి ఘటనా స్థలాన్ని సందర్శించిన కుమారస్వామి, ఈ మేరకు హామీ ఇచ్చారని చెప్పారు. కుటుంబంలో చదువుకున్న వారికి పర్మనెంట్ ఉద్యోగం ఇవ్వడంపై కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి నిబంధనల గురించి ప్రస్తావించగా, "అవసరమైతే కేబినెట్‌కు తీసుకెళ్లైనా దీన్ని సాధిస్తాను, ఇది నా బాధ్యత" అని కుమారస్వామి స్పష్టం చేశారని లోకేష్ వివరించారు. ప్రభుత్వం కేవలం హామీలు ఇచ్చి చేతులు దులుపుకోదని, బాధితులకు శాశ్వతంగా అండగా నిలుస్తుందని లోకేష్ స్పష్టం చేశారు. "నిన్న సాయంత్రం 4:10 గంటలకు ప్రమాదం జరగగానే కలెక్టర్, సీపీ ఘటనా స్థలానికి చేరుకున్నారు. హోం మంత్రి అనిత, ఎంపీ శ్రీభరత్, పల్లా శ్రీనివాస్ కూడా వచ్చారు. కేంద్ర మంత్రులు కుమారస్వామి, వర్మ కూడా వెంటనే స్పందించి పరిస్థితిని సమీక్షించారు. కుమారస్వామి గారు ఇచ్చిన ఆదేశాల మేరకు, ఈరోజు తేదీ మారేలోపే 8 మంది మృతుల కుటుంబాల అకౌంట్లలోకి తక్షణ సాయంగా రూ.25 లక్షలు జమ చేస్తాం. దీనితో పాటు పీఎఫ్, స్టీల్ ప్లాంట్ నిబంధనల ప్రకారం రావాల్సిన మిగతా పరిహారం కూడా త్వరలోనే అందిస్తాం" అని తెలిపారు. ప్రమాదం జరిగిన తీరుపై లోతైన దర్యాప్తు జరుగుతుందని లోకేష్ అన్నారు. "ఇది కింద నుంచి లీకవ్వలేదు, పైనుంచి పొంగలేదు. ద్రవ ఉక్కు బయటకు కక్కినట్లుగా ఉంది. దీని వెనుక కారణాలను నిగ్గు తేల్చేందుకు ముగ్గురు సీనియర్ అధికారులతో ఉన్నతస్థాయి కమిటీని వేశారు. వారు ఈరోజే విశాఖ వచ్చి కార్మికులతో మాట్లాడి నివేదిక సమర్పిస్తారు. నివేదిక ఆధారంగా కఠిన చర్యలు ఉంటాయి" అని వివరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జరిగిన ఓ సంఘటనను లోకేష్ ఉద్వేగంగా పంచుకున్నారు. "గాయపడిన శ్రీనివాస్ అనే కార్మికుడిని పరామర్శిస్తే, ఆయన తన ఆరోగ్యం గురించి కాకుండా 'అయ్యా, మమ్మల్ని కాదు, దయచేసి విశాఖ ఉక్కును కాపాడండి. లక్షలాది కుటుంబాలు దీనిపై ఆధారపడి ఉన్నాయి' అని వేడుకున్నాడు. ఆ మాటలు కార్మికులకు ఫ్యాక్టరీతో ఉన్న అనుబంధాన్ని తెలియజేశాయి. ఆయన మాటలు నన్ను కదిలించాయి" అని అన్నారు. గతంలో వాజ్‌పేయి, చంద్రబాబు హయాంలో రూ.15 వేల కోట్ల ప్యాకేజీతో ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకున్నామని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా కార్మికుల కుటుంబాలకు అదే విధంగా ఎన్డీయే ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఉత్తరాంధ్రకు రానున్న భారీ పెట్టుబడుల నేపథ్యంలో నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని, యువతకు శిక్షణ ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని లోకేష్ హామీ ఇచ్చారు.

# తెలంగాణకు భారీ వర్ష సూచన.. హైదరాబాద్‌లో మొదలైన వాన జోరు

హైదరాబాద్: తెలంగాణలో మంగళ, బుధవారాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు తెలిపింది. గంటకు 40 నుంచి 50కి.మీ వేగంతో ఈదురుగాలులతో వర్షాలు పడొచ్చని పేర్కొంది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్ జిల్లాలకు మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు తెలిపిన వాతావరణ శాఖ అధికారులు.. కామారెడ్డిలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే, బుధవారం వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు.

హైదరాబాద్‌లో భారీ వర్షం

మరోవైపు, హైదరాబాద్ నగరంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నగరంలో పలు చోట్ల ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల తీవ్రతకు రామ్‌నగర్‌లోని వీఎస్టీ రోడ్డులో భారీ వృక్షం నేలకొరిగింది. అలాగే, హైదర్‌గూడలోనూ ఓ భారీ వృక్షం నేలకొరగడంతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. పలుచోట్ల రహదారులపై వర్షం నీరు చేరింది. ముషీరాబాద్‌లో ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది.

# దశాబ్దాల విధానానికి స్వస్తి.. అణుబాంబులను మోహరించిన భారత్!

12 అణ్వస్త్రాలను ప్రయోగానికి సిద్ధంగా ఉంచిన భారత్

ఢిల్లీ: భారతదేశ రక్షణ, అణు ఆయుధ విధానంలో చరిత్రాత్మక మార్పు చోటుచేసుకున్నట్లు సమాచారం. దేశ రక్షణ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా భారత్ ప్రయోగించేందుకు సిద్ధంగా ఉండేలా 12 అణుబాంబులను మోహరించినట్లు అంతర్జాతీయ ఆయుధాల పర్యవేక్షణ సంస్థ 'స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' (సిప్రి) తన తాజా నివేదికలో సంచలన విషయాన్ని వెల్లడించింది. దశాబ్దాలుగా అనుసరిస్తున్న వ్యూహాత్మక విధానాన్ని పక్కనబెట్టి భారత్ ఈ అడుగు వేయడం అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. సాధారణంగా శాంతి సమయాల్లో భారత్ తన అణుబాంబులను, వాటిని ప్రయోగించే క్షిపణులు లేదా యుద్ధ విమానాలను వేర్వేరు ప్రాంతాలలో భద్రపరుస్తుంది. కానీ ఇప్పుడు తొలిసారిగా అణుబాంబులను నేరుగా ప్రయోగించే వ్యవస్థలతో అనుసంధానించి, సైనిక స్థావరాల్లో లేదా భూగర్భ క్షిపణి కేంద్రాల్లో యుద్ధానికి సిద్ధంగా ఉంచినట్లు సిప్రి నివేదిక పేర్కొంది. జూన్ 8న విడుదలైన ఈ నివేదిక ప్రకారం.. జనవరి 2026 నాటికి భారతదేశం వద్ద ఉన్న మొత్తం అణు ఆయుధాల సంఖ్య దాదాపు 190కి చేరింది. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్య కొద్దిగా పెరిగింది. వీటిని భూమి, గగనతలం, సముద్రం.. ఈ మూడు మార్గాల ద్వారా ప్రయోగించేలా భారత్ తన సామర్థ్యాన్ని ఆధునికీకరించుకుంది. ముఖ్యంగా అణు జలాంతర్గాముల్లో ఈ సరికొత్త వ్యూహాత్మక అణుబాంబులను మోహరించి సముద్ర గర్భంలో నిరంతర నిఘా నిర్వహిస్తున్నట్లు నివేదిక స్పష్టం చేసింది. క్షిపణులను ముందే కంటైనర్లలో సిద్ధంగా ఉంచే సాంకేతికతను భారత్ ఇటీవల అభివృద్ధి చేయడం వల్లే.. శాంతి సమయంలోనూ క్షిపణులతో అణుబాంబులను అనుసంధానించే ఈ విధానం సాధ్యపడిందని రక్షణ నిపుణులు భావిస్తున్నారు. శత్రువుల నుంచి ముప్పు పొంచి ఉన్నప్పుడు అత్యంత వేగంగా స్పందించేందుకు ఈ వ్యూహం ఉపయోగపడుతుంది. అయితే అణ్వస్త్రాలను మోహరించినప్పటికీ భారత్ తన ప్రాథమిక సూత్రమైన 'నో ఫస్ట్ యూజ్' విధానానికే కట్టుబడి ఉందని నివేదిక స్పష్టం చేసింది. దీని ప్రకారం భారతదేశం ఏ దేశంపైనా మొదటగా అణు దాడి చేయదు. ఒకవేళ శత్రుదేశం భారత్‌పై గానీ, భారత బలగాలపై గానీ అణు దాడికి పాల్పడితే.. దానికి ప్రతీకారంగా మాత్రమే భారత్ తన అణు ఆయుధాలను ప్రయోగిస్తుంది. ఏ దేశంతోనూ ఆయుధాల పోటీ పడకుండా.. కేవలం శత్రువులను నిరోధించేందుకు మాత్రమే పరిమితమైన, అత్యంత ప్రభావవంతమైన అణు సామర్థ్యాన్ని భారత్ కలిగి ఉందని సిప్రి నివేదిక వెల్లడించింది.

# కేసీఆర్, భాజపా నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్



అసెంబ్లీకి రండి.. చర్చిద్దాం. మా పీఏసీ ఛైర్మన్ అరెకపూడి గాంధీతోనే మీకు సమాధానం ఇప్పిస్తా. నాలుగు రోజులు చర్చపెట్టి వివరిస్తా" అని కేసీఆర్, భాజపా నేతలకు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు.

'రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు కూడా గెలిస్తేనే కేంద్రంలో మోదీ ప్రధాని అయ్యారు. ఆయన సబర్మతీ రివర్‌ఫ్రంట్ కడితే ఆహా.. ఓహో.. అబ్బా అని పొగుడుతారు. కానీ మనకు అవసరమైన మూసీ రివర్ ఫ్రంట్‌ను మాత్రం అడ్డుకుంటారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో పాటు ఎంపీ స్థానాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములు కారా? మన అభివృద్ధికి, మన ప్రజల అవసరాలు తీర్చేందుకు ఎందుకు ప్రయత్నించరు? ఎంతకాలం గుజరాత్‌కు గులాంలుగా ఉంటారు? ఈ నగరాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ఇక్కడి ఎంపీలకు లేదా? నగర తాగునీటి అవసరాలకు గోదావరి, సింగూరు జలాలు, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్‌రోడ్, మూసీ ప్రక్షాళనలకు అనుమతులు, నిధుల కోసం ఎందుకు పాటుపడరు?..' అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. 'మున్సిపల్ వార్డు ఎన్నికలకు సైతం మోదీ పేరు చెప్పి ఓట్లు అడుగుతారు. ఇక్కడి మన మోరీలో మురికి తీయాలంటే మోదీ వస్తారా? అందుబాటులో ఉండి పనులు చేసేవారిని, ఇక్కడి సమస్యలు తెలిపిన వారిని గెలిపిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయి..' అని అన్నారు. 'పదేపదే నేనేం చేశానని అడుగుతున్న వాళ్లు.. ప్రస్తుతం ఫామ్‌హౌస్‌లో ఉన్న కేసీఆర్ పదేళ్లలో, ప్రధాని మోదీ పన్నెండేళ్లలో ఏం చేశారో చెబితే.. గత రెండేళ్లలో నేనేం చేశానో చెబుతా. ఈ అంశంపై అసెంబ్లీలో నాలుగు రోజులు చర్చ పెడతాం. నేనేం చేశానో, ఏం ప్రణాళికలున్నాయో పీఏసీ ఛైర్మన్ గాంధీతోనే చెప్పిస్తా..' అని చెప్పారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం మియాపూర్‌లో దాదాపు రూ.1,675 కోట్ల విలువైన..సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కార్యాలయ భవనం సహా వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు.

'రాజకీయాలు, జెండాలు, అజెండాలకు అతీతంగా నగరాన్ని అభివృద్ధి చేసుకునేందుకు వివక్ష, వితండవాదం లేకుండా ప్రతిపక్ష పార్టీలు ముందుకు రావాలి. 2009 ఎన్నికలకు ఆర్నెల్ల ముందు రాజకీయం చేద్దాం.. అప్పటిదాకా అభివృద్ధికి సహకరించాలి. చేతనైతే కేసీఆర్, కిషన్‌రెడ్డి విలువైన సూచనలివ్వాలే కానీ, అబద్ధాలు, అవినీతి, అహంకారంతో అడ్డుపడొద్దు. మీ చీకటి ఒప్పందాలను ప్రజలు గమనిస్తున్నారు.

నేను ఢిల్లీ వెళ్లి ప్రధాని, కేంద్రమంత్రుల్ని కలిసిన ప్రతిసారీ మూడు రోజుల తర్వాత వారిని కలిసి.. పాలల్లో ఉప్పు వేసినట్లు.. పనులు చేస్తే ఆయనకే పేరొస్తదని కిషన్‌రెడ్డి చెడగొడతారు. ఇలాగే అభివృద్ధికి అడ్డం పడితే రాబోయే రోజుల్లో ప్రజలు పుట్టగతుల్లేకుండా తీర్పు ఇస్తారు. మీరు మళ్లీ ఢిల్లీ వెళ్లకుండా చేస్తారు..' అని ముఖ్యమంత్రి అన్నారు.

'ప్ర్యదాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నివసించే ఢిల్లీలో కాలుష్యం సమస్య. ముంబైలో వరదనీరు, ట్రాఫిక్, మురికివాడల సమస్యలు. ఐటీకి పేరెన్నికగన్న బెంగళూరులో ట్రాఫిక్ సమస్య. ఇంటినుంచి వెళ్తే ఎయిర్‌పోర్టుకు చేరేందుకు ఎంత సమయం పడుతుందో తెలియదు. చెన్నైలో అపార్ట్‌మెంట్లు, కాలనీలు వర్షమొస్తే నీళ్లలోనే. కోల్‌కతాలో బయటకు వెళ్లినవారు ఇంటికి ప్రాణాలతో తిరిగి వస్తారో లేదో తెలియని శాంతిభద్రతల సమస్య. వాటి తీవ్రతను అర్థం చేసుకునే హైదరాబాద్‌కు ఆ దుస్థితి రాకుండా నిపుణుల సూచన మేరకు మూడు కార్పొరేషన్లు చేశాం. ప్రజల సమస్యలు ఎక్కడికక్కడే పరిష్కారమయ్యేలా సరిహద్దులు నిర్ణయించాం..' అని రేవంత్ తెలిపారు.

నగరంలోని పేదలకు.. సమీపంలోని ప్రభుత్వ భూముల్లో లక్ష ఎల్‌ఐజీ, ఎంఐజీ గృహాలను నిర్మించేందర్నికు ప్రణాళిక సిద్ధమవుతోంది. మంత్రి పొంగులేటి త్వరలో పథకాన్ని ప్రకటిస్తారు. అందుకు ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి స్వాధీనం చేసుకుంటున్నాం. మహిళలను కోటీశ్వరులను చేస్తామనే మాటను నిలబెట్టుకుంటున్నాం. మహిళా సంఘాలకు పెట్రోలు బంకులిస్తున్నాం. వెయ్యి ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశాం. మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను విక్రయించుకునేందుకు ప్రముఖ ఐటీ కంపెనీల మధ్య మూడున్నర ఎకరాల్లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటుచేశాం. అమెజాన్ వెబ్‌సైట్‌లో తమ ఉత్పత్తులను విక్రయించుకునే వసతి కల్పించాం. అన్ని పార్టీల నేతలు ప్రభుత్వంతో కలిసి పనిచేయాలి. ఎన్నికలకు ఆరు నెలల ముందు నుంచి రాజకీయాలు చేద్దాం. నగరానికి వలస వచ్చేవారికి కావాల్సింది విద్య, వైద్య సదుపాయాలే. వాటిని బలోపేతం చేద్దాం" అని సీఎం పిలుపునిచ్చారు.

# రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు సీఎం చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశంలో పాల్గొంటారు. మరుసటి రోజు గురువారం నాడు రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో చంద్రబాబు పాల్గొంటారు. ఈ సమావేశం ఉదయం 9:15 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. అనంతరం ఢిల్లీ నుంచి బయలుదేరి రాత్రి 9.00 గంటలకు అమరావతి చేరుకుంటారు.

# రాష్ట్ర కేబినెట్ రోజుకు 18 గంటలు ప్రజల కోసం పనిచేస్తోంది

హైదరాబాద్: తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బీఆర్ఎస్ నాయకులపై, ముఖ్యంగా మాజీ మంత్రి హరీష్ రావుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వరంగల్ జిల్లా చిల్పూర్ మండలం పల్లగుట్ట గ్రామంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తుంటే... హరీష్ రావు మాత్రం అబద్ధాలు ప్రచారం చేయడంలో బిజీగా ఉన్నారని మండిపడ్డారు. "రాష్ట్ర క్యాబినెట్ రోజుకు 18 గంటలు ప్రజల కోసం పనిచేస్తుంటే.. హరీష్ రావు నిత్యం అబద్ధాలు చెబుతున్నారు" అని భట్టి విమర్శించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని దోచుకుని, దివాలా తీయించిందని ఆయన ఆరోపించారు. మరి నాడు అధికారంలో ఉన్నప్పుడు పేదలకు సన్నబియ్యం ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వ విజయాలను ఆయన పంచుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే 76,000 ప్రభుత్వ ఉద్యోగాలు అందించిందని, రైతులకు అండగా నిలుస్తూ తడిసిన, దెబ్బతిన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తోందని తెలిపారు. అలాగే రుణమాఫీ పథకాన్ని నిలకడగా అమలు చేస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యానికి గురైన దేవాదుల ప్రాజెక్టును తాము వేగవంతం చేశామన్నారు. గత ప్రభుత్వం డిస్కమ్‌లకు బకాయిలు పెట్టడం వల్లే విద్యుత్ సమస్యలు వచ్చాయని, తాము ఆ బకాయిలను చెల్లిస్తూ విద్యుత్ సరఫరాను మెరుగుపరిచామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో నెరవేరుస్తున్నామని చెప్పారు. రఘునాథపల్లిలో 230 కేవీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు.

# హర్మూజ్ జలసంధి వద్ద కుప్పకూలిన అమెరికా హెలికాప్టర్!

ఢిల్లీ: అమెరికా సైన్యానికి చెందిన అపాచీ హెలికాప్టర్ సోమవారం హర్మూజ్ జలసంధి సమీపంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో హెలికాప్టర్‌లోని ఇద్దరు సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారని, వారికి ఎటువంటి గాయాలు కాలేదని అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ధృవీకరించారు. న్యూయార్క్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ట్రంప్, "పైలట్లు క్షేమంగా ఉన్నారు, ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు" అని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన అధికారిక నివేదికను మంగళవారం విడుదల చేస్తామని ఆయన తెలిపారు. ప్రపంచం చమురు రవాణాలో ఐదో వంతు వాటా కలిగిన హర్మూజ్ జలసంధి అత్యంత కీలకమైన ప్రాంతం. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో ఈ ప్రమాదం సంభవించడం గమనార్హం. ఇది శత్రువుల దాడి వల్ల జరిగిందా లేదా సాంకేతిక లోపం కారణంగా కుప్పకూలిందా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రాంతంలో ఇరాన్ కార్యకలాపాలను నియంత్రించే విధుల్లో భాగంగానే ఈ హెలికాప్టర్ సేవలందిస్తున్నట్లు తెలుస్తోంది.

# ధాన్యం పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయం చేస్తున్నారు

హైదరాబాద్: ధాన్యం పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయం చేస్తున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. '10 రకాల పంటలకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక మోసం చేసింది. బోనస్‌ను సన్న ధాన్యానికే పరిమితం చేశారు. అదీ ఒక్క సీజన్‌కే. గతేడాది, ఈ సారి యాసంగిలో సన్నాలు అమ్మిన రైతులకు బోనస్ ఇవ్వలేదు. తెలంగాణలో 52 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు కేంద్రం, రాష్ట్రం మధ్య ఒప్పందం జరిగినా.. సీఎం రైతుల్ని తప్పుదారి పట్టిస్తున్నారు. కేంద్రం మొత్తం పంట సేకరిస్తే ఆ వడ్లను ఏం చేయాలి? ఆ డబ్బు ప్రజలదే కదా? పార్టీలు మారడంలో, అవినీతి-అక్రమాల ఆరోపణల్లో, పదవులు తెచ్చుకోవడంలో రేవంత్‌రెడ్డి సమర్థుడు. ఆ కోణంలోనే ఆయన సీఎం పదవి కూడా తెచ్చుకున్నారు' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు, సెమీ కండక్టర్లు, రక్షణ రంగం భవిష్యత్ క్రిటికల్ మినరల్లపైనే ఆధారపడి ఉందని.. దేశ భద్రత, పారిశ్రామిక అభివృద్ధికి మోదీ ప్రభుత్వం భారీ ప్రణాళికలు రూపొందిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. క్రిటికల్ మినరల్ల నుంచి కోల్ గ్యాసిఫికేషన్ వరకు దేశాన్ని 'మినరల్ పవర్'గా అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందించామని తెలిపారు. 2014 నుంచి కేంద్ర బొగ్గు, గనుల శాఖ సాధించిన విజయాలు, సంస్కరణలపై ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. మైనింగ్ ప్రభావిత ప్రాంతాలకు ఖర్చుచేయాల్సిన డీఎంఎఫ్ నిధుల్ని గత భారాస, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు దారి మళ్లించి ఇతర అవసరాలకు ఖర్చు చేశాయని ఆక్షేపించారు. గత ప్రభుత్వం సిద్దిపేట జిల్లాకు నిధుల్ని తీసుకెళితే.. ప్రస్తుత సీఎం.. ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీ కోసం ఖర్చుచేశారని, సింగరేణి నిధుల్ని స్కూళ్లకు వెచ్చిస్తున్నారని విమర్శించారు. 2028 ఎన్నికల్లో రాష్ట్రంలో వచ్చేది భాజపా ప్రభుత్వమేనన్నారు. సింగరేణి ఉద్యోగులు చెల్లిస్తున్న ఆదాయపు పన్ను మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చేయాలని.. లేదంటే తాము అధికారంలోకి వచ్చాక చేస్తామని ప్రకటించారు. "20వ శతాబ్దం ఆయిల్ ఎకానమీదైతే, 21వ శతాబ్దం క్రిటికల్ మినరల్స్ ఎకానమీది. ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌పై యుద్ధంలో మనం క్రిటికల్ మినరల్లను వాడాం. విషయం తెలిసిన ఒక దేశం భారత్‌కు క్రిటికల్ మినరల్ల సరఫరా నిలిపేసింది. ఇప్పటి వరకు 93 శాతం దిగుమతి చేసుకుంటుండగా.. తాజా పరిణామాల నేపథ్యంలో గనుల శాఖ ద్వారా ఆ పరిస్థితిని మార్చబోతున్నాం. అర్జెంటీనాలో ఐదు క్రిటికల్ మినరల్ బ్లాక్‌లను కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల భాగస్వామ్య సంస్థ 'కాబిల్' సొంతం చేసుకుంది. త్వరలో ఉత్పత్తి ప్రారంభిస్తాం. ఆస్ట్రేలియా, అమెరికాలతోనూ ఈ ఖనిజం కోసం చర్చలు జరుపుతున్నాం. దేశంలోనూ అన్వేషణ వేగవంతం చేశాం. గుజరాత్, మహారాష్ట్ర, ఏపీ, ఒడిశాలలో క్రిటికల్ మినరల్ ప్రాసెసింగ్ పార్కులు ఏర్పాటు చేస్తాం. యూపీఏ హయాంలో బొగ్గు, గనుల కేటాయింపులో రూ.1.8 లక్షల కోట్ల కుంభకోణాలు జరిగాయి. ఒక్క అవినీతి ఘటనా జరగలేదని గర్వంగా చెబుతున్నా. పారదర్శకంగా ప్రైవేటు సంస్థలకు కేటాయించిన గనులతో రెండేళ్లలో 800 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుంది. ప్రత్యక్షంగా 5 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. గతంలో విద్యుత్ ఉత్పత్తికి బొగ్గు కొరత ఉండేది.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. క్రిటికల్ మినరల్ల అన్వేషణ, రీసైక్లింగ్‌కు రూ.32 వేల కోట్లు.. బొగ్గుతో సింథటిక్ గ్యాస్, హైడ్రోజన్, అమ్మోనియా, ఎరువులు, పెట్రోకెమికల్స్ ఉత్పత్తికి కోల్ గ్యాసిఫికేషన్‌కు రూ.46 వేల కోట్ల ప్రోత్సాహకాలను ప్రకటించాం. గ్యాసిఫికేషన్‌తో రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు లభిస్తాయి" అని కిషన్‌రెడ్డి వివరించారు. కేంద్రమంత్రిగా తాను భారాస హయాంలో 40కిపైగా లేఖలు రాసినా స్పందించలేదని.. ఇప్పుడేమో కేటీఆర్ తనకు లేఖలు రాస్తున్నారని పేర్కొన్నారు.

# బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ

మొదటి పేజి తరువాయి

కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. బాధితులను స్వయంగా అడిగి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. అనంతరం స్టీల్ ప్లాంట్‌లోని ప్రమాద స్థలాన్ని పరిశీలించి యాజమాన్యం, ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు ప్రకటించారు. గాయపడిన వారికి రూ. 10 లక్షల చొప్పున సాయం అందిస్తామని, వారి పూర్తి చికిత్స ఖర్చులను ఆర్.ఐ.ఎన్.ఎల్. భరిస్తుందని పవన్ కళ్యాణ్ తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగం కల్పిస్తామన్నారు. పదవీ విరమణ ప్రయోజనాల కింద రెగ్యులర్ ఉద్యోగులకు రూ. 1.72 కోట్లు, కాంట్రాక్టు ఉద్యోగులకు రూ. 45.75 లక్షలు అందుతాయని వివరించారు. మృతుల పిల్లల చదువులకు కూడా యాజమాన్యం సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. గత 30 ఏళ్లలో ఇలాంటి ఘోర దుర్ఘటన జరగలేదని పవన్ పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన ముందు రోజు రాత్రి కూడా ప్లాంట్‌లో ఇలాంటి చిన్న సాంకేతిక లోపం తలెత్తిందని, అయితే రాత్రి వేళ కార్మికులు ఎవరూ లేకపోవడం వల్ల ఎవరికీ తెలియలేదని తన దృష్టికి తెచ్చారని ఆయన వివరించారు. ప్లాంట్‌లో భద్రతా ప్రమాణాలు, యంత్రాల ఆధునికీకరణపై దర్యాప్తు చేయడానికి ఒక ప్రత్యేక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశామని, వారి నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్ కార్మికుల సమస్యలపై, వారి భద్రతపై త్వరలోనే ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి స్వయంగా కార్మికులతో మాట్లాడతానని పవన్ హామీ ఇచ్చారు. ఇలాంటి ఘోర ప్రమాదాలు జరిగినప్పుడు కేవలం బాధపడి వదిలేయకుండా.. ఉద్యోగుల ప్రాణాలకు రక్షణ కల్పించేందుకు యాజమాన్యం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# పశ్చిమ బెంగాల్‌లో పార్టీలో సంక్షోభం.. తృణమూల్ కాంగ్రెస్ ఏమన్నదంటే?

మొదటి పేజి తరువాయి

ఇప్పుడు పార్టీ అధికారంలో లేదనే సాకుతో విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇది కేవలం అధికారం కోసం చేస్తున్న ద్రోహమని ఆయన ధ్వజమెత్తారు. పశ్చిమ బెంగాల్‌లో అధికారం కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్ ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ నాయకత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన సుమారు 20 మంది లోక్‌సభ ఎంపీలు, పార్లమెంటులో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. తమను ప్రత్యేక వర్గంగా గుర్తించాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాసినట్లు రెబల్ ఎంపీ కకోలీ ఘోష్ దస్తిదార్ ప్రకటించారు. రాష్ట్రంలో 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరదించుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ పరాజయం పాలైన విషయం తెలిసిందే. ఈ ఓటమి అనంతరం పార్టీలో అసమ్మతి జ్వాలలు మిన్నంటాయి. ఇప్పటికే 58 మంది టీఎంసీ ఎమ్మెల్యేలు పార్టీ అధికారిక శాసనసభాపక్ష నేత అభ్యర్థిని కాదని, బహిష్కరణకు గురైన నేతకు మద్దతు తెలపడం గమనార్హం. తాజాగా ఈ సంక్షోభం పార్లమెంటుకు సైతం పాకింది. పార్టీలో పెరుగుతున్న అవినీతి, సీనియర్ నేతలను విస్మరించడం, మమత కుటుంబ సభ్యుల ఆధిపత్యమే ఈ తిరుగుబాటుకు ప్రధాన కారణాలని అసమ్మతి నేతలు ఆరోపిస్తున్నారు. పలువురు రెబల్ ఎంపీలు ఇప్పటికే కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్, బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారితో సమావేశమయ్యారు.

# దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి

రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై, కేంద్ర ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... అహంకారం, అభద్రతా భావం, తీవ్ర నిరాశతోనే రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలకు, తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. "కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందంటే అది రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీల దయాదాక్షిణ్యాల వల్లేమీ కాదు. నేను అంబర్‌పేట్, సికింద్రాబాద్ ప్రజల ఆశీస్సులతో ఢిల్లీకి వెళ్లాను. రేవంత్ రెడ్డికి సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు. తెలంగాణ ప్రజలకు, నా నియోజకవర్గానికి, నా పార్టీకి మాత్రమే నేను జవాబుదారీని" అని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులపై సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. "రేవంత్ రెడ్డికి దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి. ప్రెస్ క్లబ్ అయినా సరే లేదా అమరవీరుల స్థూపం ముందైనా సరే నేను చర్చకు సిద్ధం" అని ప్రకటించారు. తాను తెలంగాణకు రావాల్సిన ఏ ఒక్క ప్రాజెక్టునైనా అడ్డుకున్నానని నిరూపిస్తే తక్షణమే రాజీనామా చేస్తానని, దీనిపై సీనియర్ జర్నలిస్టులతో ఒక కమిటీని వేసి విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు, మెట్రో ఫేజ్-2 పై సీఎం చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. తుమ్మిడిహట్టి అపాయింట్‌మెంట్ వ్యవహారంపై రేవంత్ రెడ్డి ఆధారాలు లేని ఆరోపణలు మానేసి, పద్ధతిగా అధికారికంగా అపాయింట్‌మెంట్ కోరాలని సూచించారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ అవినీతి, తప్పుడు నిర్వహణతో మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను అప్పుల పాలు చేశాయని కిషన్ రెడ్డి విమర్శించారు.

# స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రల వల్లే ప్రమాదాలు

బొత్స సత్యనారాయణ

అమరావతి: విశాఖ స్టీల్ ప్లాంట్ ఘోర ప్రమాదంలో గాయపడి కేజీహెచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను వైసీపీ నేతలు బొత్స సత్యనారాయణ, కురసాల కన్నబాబు, కేకే రాజులతో కూడిన బృందం పరామర్శించింది. అనంతరం మీడియాతో బొత్స మాట్లాడుతూ... ఈ ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు చనిపోవడం అత్యంత బాధాకరమని అన్నారు. బాధితులు కోరుతున్న పరిహారం గొంతెమ్మ కోరిక కాదని, ప్రభుత్వం వారి డిమాండ్లను తక్షణమే అంగీకరించాలని చెప్పారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి స్టీల్‌ప్లాంట్‌ను తమ తాబేదార్లకు కట్టబెట్టేందుకు, ప్రైవేటీకరణ చేసేందుకే కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ఈ కుట్రల వల్లే ప్లాంట్‌లో వరుస ప్రమాదాలు జరుగుతూ కార్మికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని ఆరోపించారు. స్టీల్ ప్లాంట్ నుంచి సమర్థులైన, అనుభవజ్ఞులైన అధికారులను దొడ్డిదారిన బదిలీ చేయడం వల్లే ఈ భారీ ప్రమాదం చోటుచేసుకుందని బొత్స విమర్శించారు. ఇప్పటికే దాదాపు 10 వేల మంది శాశ్వత, కాంట్రాక్ట్ ఉద్యోగులను అన్యాయంగా తొలగించారని, ఇకనైనా బలవంతపు వీఆర్ఎస్ చర్యలను ఆపాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు 'ఎల్జీ పాలిమర్స్' తరహాలో కోటి రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని, ఈ విషయంలో వైసీపీ రాజీలేని పోరాటం చేస్తుందని తేల్చి చెప్పారు. అలాగే, బాధితులను పరామర్శించేందుకు జగన్ రేపు విశాఖలో పర్యటిస్తారని వెల్లడించారు.

## కిశోర దశలోనే భవితకు పునాది
## సుగురు బాలికలకు అవగాహన శిక్షణ



మంత్రాలయం, శివసూర్య (ప్రతినిధి) జూన్ 9: మంత్రాలయం మండలం సుగురు గ్రామంలో మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో మంగళవారం కిశోర బాలికల సూక్ష్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమిత్రమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త ద్రాక్షాయని మాట్లాడారు. 10 నుండి 19 సంవత్సరాల బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత నివారణ, సమతుల పోషకాహారం, బాల్య వివాహాల అనర్థాలు, బాలికా విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ, గ్రామ సర్పంచ్, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు నరసమ్మ, జయలక్ష్మి, రాధమ్మ, హనుమంతమ్మ, ఆశా కార్యకర్తలు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో కిశోర బాలికలు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలి
## - ఎమ్మార్వోకు సీపీఐ వినతి పత్రం



మంత్రాలయం,శివసూర్య(ప్రతినిధి)జూన్ 9: పెట్రోల్, డీజిల్ ధరలు, గ్యాస్ సిలిండర్ ధరలు అధికంగా పెంచడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ధరలు తగ్గించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) మంత్రాలయం మండల సమితి డిమాండ్ చేసింది. మంత్రాలయం తహసీల్దార్‌కు సీపీఐ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి డి.వి. భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపుతున్నాయని విమర్శించారు. పెరిగిన ధరలతో పేద, మధ్య తరగతి ప్రజల జీవనం దుర్భరంగా మారిందన్నారు. ప్రధాన డిమాండ్లు:బీపీఎల్ కార్డుదారులకు 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలి. రైతులకు డి.ఏ. బకాయిలు వెంటనే చెల్లించాలి. కూలీలకు ప్రభుత్వం కనీస వేతనం రూ. 3000 ఇవ్వాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అందేలా చర్యలు తీసుకోవాలి.ప్రభుత్వం స్పందించి ధరలు తగ్గించకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎస్. లక్ష్మన్న నాయక్, సహాయ కార్యదర్శి ఎ. ఈరన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కోల్దిన్నె పూజారి కృష్ణయ్యను
## పరామర్శించిన జిల్లా అధ్యక్షులు చక్రవర్తి చార్యులు



గద్వాల, జూన్ 9: జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా కోల్దిన్నె గ్రామంలోని శ్రీ ఆంజనేయ-చెన్నకేశవ స్వామి దేవాలయ అర్చకులు, ధూప దీప నైవేద్య అర్చక సంఘం సభ్యులు శ్రీ కృష్ణయ్య ప్రమాదవశాత్తు కర్నూలు రోడ్డుపై బైక్ ప్రమాదానికి గురై కాలు విరిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం చికిత్స పొందుతూ కోలుకుంటున్న ఆయనను జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు చక్రవర్తి చార్యులు పరామర్శించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న చక్రవర్తి చార్యులు, ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని సకల దేవతలను ప్రార్థించారు. అర్చక సంఘం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, "మీకు నేనున్నాను, అర్చక సంఘం ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుంది" అని ధైర్యం చెబుతూ ఆచార్య భరోసా కల్పించారు. ప్రమాదం నుండి త్వరగా కోలుకుని తిరిగి స్వామివారి సేవలో నిమగ్నం కావాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో అర్చక సంఘం సభ్యులు పాల్గొని కృష్ణయ్యకు ధైర్యం చెప్పారు.

## జిల్లా అర్చక సంఘం అధ్యక్షులుగా
## ఎన్నికైన శుభ
## సందర్భంగా అర్చకుల ఘన సత్కారం



గద్వాల, శివసూర్య జూన్ 9 . జోగులాంబ గద్వాల జిల్లా ధూప దీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడిగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి వెంకట్రామయ్య ఆధ్వర్యంలో మండల డి.డి.ఎన్.ఎస్. అర్చక సంఘం ఇన్‌చార్జిలు జిల్లా అధ్యక్షులు చక్రవర్తి చార్యులను ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అర్చక సంఘం సభ్యులు మాట్లాడుతూ, అర్చకుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తూ, ప్రతి కార్యక్రమంలో అర్చకులతో మమేకమై సేవలందిస్తున్న చక్రవర్తి చార్యులు రెండవసారి అధ్యక్షులుగా ఎన్నిక కావడం సంతోషకరమని పేర్కొన్నారు. అనంతరం సభ్యులకు స్వీట్లు పంపిణీ చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల అర్చకులు, మండల ఇన్‌చార్జిలు, అర్చక సంఘం సభ్యులు పాల్గొని నూతనంగా ఎన్నికైన అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ధూప దీప నైవేద్య మండల ఇన్‌చార్జీలకు
## సత్కారం చేసిన జిల్లా అధ్యక్షులు చక్రవర్తి చార్యులు

గద్వాల, శివసూర్య జూన్ 9: జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మున్సిపాలిటీలోని శ్రీలేఖ కిరాణం



ప్రాంగణంలో ధూప దీప నైవేద్య సేవ (డి.డి.ఎన్.ఎస్) మండల ఇన్‌చార్జీలు శ్రవణ్, శేఖర్, నాగరాజులను జిల్లా అధ్యక్షులు చక్రవర్తి చార్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చక్రవర్తి చార్యులు మాట్లాడుతూ అర్చకులకు తగిన ప్రాధాన్యత కల్పిస్తూ, ఐకమత్యంతో ముందుకు సాగాలని సూచించారు. అర్చకులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, సనాతన ధర్మ పరిరక్షణను ధ్యేయంగా చేసుకుని పనిచేయాలని పిలుపునిచ్చారు. దేవాలయ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను విలువలతో కాపాడుతూ సమాజంలో ధార్మిక చైతన్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని తెలిపారు. అర్చకులందరూ పరస్పర సహకారంతో ముందుకు సాగితే సంఘం మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. మండల ఇన్‌చార్జీలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సేవాభావంతో పనిచేస్తే భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు వారిని వరిస్తాయని చక్రవర్తి చార్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, సంఘ నాయకులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## బహుళ నవమి లో
## శ్రీ శ్రీ శ్రీ గుంటి రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు



ఐజ, శివసూర్య జూన్ 9 : జోగులాంబ గద్వాల జిల్లా అల్లంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ ఆరవ వార్డు తుపత్రాల గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి గుంటిరంగనాథ స్వామికి అధిక జ్యేష్ఠ మాసం బహుళ నవమి సందర్భంగా గోదారంగనాథ స్వామికి పట్టణ మరియు గ్రామప్రజలందరూ భక్తిశ్రద్ధలతో కేశవ నామాలతో రామానుజాచార్యఅష్టోత్తర శతనామావళి స్మరించుకొని భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి యొక్క గోవిందం భజగోవిందం హనుమాన్ చాలీసా విష్ణు సహస్ర నామావళి అష్టోత్తరాలు పల్లకి సేవతో ఊరేగింపుగా భక్తాదులందరూ భక్తి ప్రపత్తులతో కార్యక్రమాలు నిర్వహించి భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకోవడం జరిగింది. అనంతరం స్వామివారికి కాయ కర్పూరాలు తీర్థప్రసాదాలను సమర్పించుకొని మొక్కులను చెల్లించుకుని అనంతరం ఆలయ అర్చకులు ఆచార్య శ్రీ వైష్ణవం చక్రవర్తి చార్యులు భక్తాదులందరికీ ఆశీర్వచనాలు మంగళా శాసనాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకట్రాములు రమేష్ కౌన్సిలర్ మహేశ్వరివెంకన్నగౌడ్ రఘు శంకర్ పాండు అమర్ చిన్నఆంజనేయులు వీరేష్ గ్రామ ప్రజలు ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## వికాస తరంగిణి ఆధ్వర్యంలో
## సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం



జోగులాంబ, శివసూర్య జూన్ 9 . గద్వాల జిల్లా అలంపూర్ తాలూకా ఐజ మున్సిపాలిటీ భరత్‌నగర్ కాలనీలో వికాస తరంగిణి సభ్యులు జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు చక్రవర్తి చార్యుల స్వగృహంలో వికాస తరంగిణి, అర్చక సంఘం మరియు హెల్పింగ్ హాండ్స్ సభ్యుల ఆధ్వర్యంలో సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణం, ఆంజనేయ స్వామి దండకం పారాయణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీమహావిష్ణువు మరియు ఆంజనేయ స్వామి వారి నామస్మరణలో మునిగిపోయారు. ప్రతిరోజూ చక్రవర్తి చార్యుల స్వగృహంతో పాటు శ్రీలేఖ కిరాణం ప్రాంగణంలో కూడా ఆంజనేయ స్వామి దండకం, హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహించబడుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా చక్రవర్తి చార్యులు మాట్లాడుతూ, విష్ణు సహస్రనామం, హనుమాన్ చాలీసా మరియు ఆంజనేయ స్వామి దండకం పారాయణం చేయడం వల్ల మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక చైతన్యం, ధైర్యం మరియు దైవానుగ్రహం లభిస్తాయని పేర్కొన్నారు. భక్తులు నిత్యం భగవన్నామ స్మరణ చేయాలని, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని జీవితాన్ని ధన్యంగా మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు, అర్చక సంఘం ప్రతినిధులు, హెల్పింగ్ హాండ్స్ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## పూరి గుడిసె లేని జిల్లాగా తీర్చిదిద్దాలి
## జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

జూన్ 9జిల్లాలో ఒక్క పూరిగుడిసె కూడా లేకుండా పూరిగుడిసెలు లేని జిల్లాగా" కామారెడ్డిని తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. రామారెడ్డి మండలంలోని వడ్డెర కాలనీ సందర్శించి పూరిగుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలో పర్యటించిన సందర్భంగా పూరిగుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాల పరిస్థితిని పరిశీలించిన జిల్లా కలెక్టర్, గృహ సౌకర్యం లేని అర్హుల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించి ప్రభుత్వ నిబంధనల మేరకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పూరి గుడిసెలో ఉన్నవారిని గుర్తించి వారికి ఇళ్లు మంజూరు చేయాలని, పేమెంట్ సమస్యలు తలెత్తితే ఏపీఎం ద్వారా రుణాలు మంజూరు చేయాలని అన్నారు. నిజమైన లబ్ధిదారులను గే ఎలాంటి పొరపాట్లు జరగకుండా గ్రామస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబం ప్రభుత్వ గృహ పథకాల ప్రయోజనం పొందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పనులు వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక, పరిపాలనా సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూ॥ హౌసింగ్ విజయపాల్ రెడ్డి, తాసిల్దార్ ఉమలత, ఎంపీడీవో నాగేశ్వర్, సర్పంచ్ బండి ప్రవీణ్,, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గిరిజన నిరుద్యోగ
## యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ
## ఎంపీడీవో మల్లెల రవీంద్ర ప్రసాద్

ఖమ్మం జిల్లా, కారేపల్లి :, జూన్ 9 : సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) భద్రాచలం ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం , ఖమ్మం జిల్లాల పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సింగరేణి మండల ఎంపీడీవో మల్లెల రవీంద్ర ప్రసాద్ తెలిపారు. రెండు నుంచి ఐదు నెలల వ్యవధిలో నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమాల్లో గిరిజన యువతీ యువకులు పాల్గొని ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలని ఆయన సూచించారు . ఈ శిక్షణ కాలంలో ఉచిత భోజనం , వసతి , యూనిఫాం , స్టడీ మెటీరియల్ అందించడంతో పాటు శిక్షణ పూర్తయిన అనంతరం సర్టిఫికెట్ కూడా అందజేయనున్నట్లు తెలిపారు . ఇల్లందులోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో కూడా ఈ శిక్షణ కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయని , శిక్షణ పొందే అభ్యర్థులకు వసతి , భోజనం , ఇతర సౌకర్యాలను గిరిజన అభివృద్ధి సంస్థే కల్పిస్తుందని పేర్కొన్నారు . ఆసక్తి గల సింగరేణి మండలం గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మల్లెల రవీంద్ర ప్రసాద్ కోరారు.

## వంటగ్యాస్ ధరలను పెంచి ప్రజలపై
## బండ భారం మోపడం బీజేపీ ప్రభుత్వ అసమర్థతే.

**ఖాళీ గ్యాస్ సిలిండర్ ల తో పి ఓ డబ్ల్యూ- (ప్రగతిశీల మహిళా సంఘం) నిరసన.**

నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. జూన్ 9. . కేంద్రంలో బీజేపీ మోడీ ప్రభుత్వం సామాన్యులపై ధరల భారాన్ని, మరోవైపు పన్నుల భారాన్ని మోపి జేబులు కొల్లగొడుతుందని ప్రగతిశీల మహిళా సంఘం (పి.ఓ.డబ్ల్యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి పజ్జూరు ఉపేంద్ర అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక దపాలగా పెంచిన వంటగ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని నార్కట్ పల్లి మండలం పల్లె పహాడ్ గ్రామంలో ఖాళీ సిలిండర్ల తో పి.ఓ.డబ్ల్యూ ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉపేంద్ర మాట్లాడుతూ.. గృహ వినియోగ యల్.పీ.జీ సిలిండర్లపై రూ.29, రూ,,లు పెంచడం పేదల జీవితాలపై ఆర్థిక దాడి చేయడమేనని అన్నారు. యుద్ధాల పేరుతో నిత్యావసర ధరలు పెంచుకుంటూ పోతే, పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక స్థితి కుదేలవుతుందని మండిపడ్డారు. సామ్రాజ్యవాద, పెట్టుబడి దేశాలు ప్రపంచ మార్కెట్ విస్తరణ కోసం, అయిల్ నిక్షేపాలు, కనిజ, సహజ వనరుల దోపిడి కోసం చిన్నదేశాలపై అత్యంత క్రూరంగా వైమానిక దాడులు చేస్తూ ప్రపంచ శాంతికి విఘాతం చేస్తుంటే భారత ప్రధాని యుద్ధాల నివారణపై నోరువిప్పక పోవడం అసమర్థతకు నిదర్శనం అన్నారు. సామ్రాజ్య వాద దేశాల మధ్య యుద్ధాల ప్రభావం ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేస్తుందని, పకృతి సహజ వనరులను కోల్పోతామని అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన పన్నెండేళ్లలో ఇప్పటికే అనేకసార్లు గ్యాస్, ఆయిల్ ధరలు పెంచిందని మండిపడ్డారు. మళ్ళీ వినియోగదారులపై అధికంగా గ్యాస్ ధరలు పెంచుతున్నారని అన్నారు. దేశ ప్రజలపై అధిక భారాలను మోపాలనే మోడీ ప్రభుత్వ ఆలోచనను వెనక్కి తీసుకొని పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని అన్నారు. హిందువుల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం నిత్యావసర ధరలు పెంచి దేశంలో ఉన్నా 80%మంది హిందువులను లూటి చేస్తుందని అన్నారు. దేశభక్తి అంటే ప్రజల ఆస్తులను లూటి చేయడం కాదని, ప్రజల ఆర్థిక అభివృద్ధిని సాధించడం అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో పి.ఓ.డబ్ల్యూ తోడుసు జయలక్ష్మి, చిరమెని చంద్రకళ, మట్టిపెల్లి యాదమ్మ, మీడిదొడ్డి సోవమ్మా, మీడిదొడ్డి సునీత, పజ్జూరు పద్మ, కొప్పుల రజిత, చింతల అనిత, షేక్ జరీనా తదితరులు పాల్గొన్నారు.

## సాగంటి మంజులను అభినందించిన ఏపీ మంత్రి

:ఈ నెల 6,7 తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాజమహేంద్రవరం గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ లో శ్రీ శ్రీ కళావేదిక, చైతన్య సారస్వత పరిషత్ సంయుక్తంగా నిర్వహించిన 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో హనుమకొండకు చెందిన ప్రముఖ విద్యా వేత్త, సామాజిక వేత్త, కవయిత్రి, చిత్రకారిణి ఐన డాక్టర్ మంజుల సాగంటి తనదైన శైలీ లో తెలుగు భాషపై తనకున్న అభిమానాన్ని,అమ్మ భాషైనా తెలుగు భాషకు ప్రాముఖ్యత ఇవ్వాలని స్వయంగా రాసి కవితా గానం చేసినందుకు ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ, టూరిజం ఓ సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ వి సి చైతన్య రాజు చేతుల మీదుగా సన్మానం తో మంత్రి నుండి పలు ప్రశంసలు అందుకున్నారు...ఈ కార్యక్రమం లో సంస్థ జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు..

## నెహ్రూ రికార్డును బద్దలు కొట్టిన నరేంద్రమోడీ
## ప్రధానికి నందునామాజీ శుభాభినందలు

నారాయణపేట జూన్ 9:భారతదేశ ప్రధానిగా 4,398 రోజులు కొనసాగిన జవహర్ లాల్ నెహ్రూ రికార్డును నేడు బుధవారం ప్రస్తుత బిజెపి ప్రధాని నరేంద్రమోడీ 4,399 రోజుల ప్రధానిగా ఇంకా కొనసాగనున్న ప్రధానిగా బద్దలు కొట్టారు. రెండు పూర్తి మెజారిటీ ప్రభుత్వాలను నెహ్రూ తొలి కాంగ్రెస్ నేతగా మే 13 1952 నుంచి మే 27 1964 వరకు ప్రధానిగా 4,398 రోజులు ప్రధానిగా ఉన్నారు. అయితే కాంగ్రెసేతర బిజెపి నేత ప్రధాని నరేంద్రమోడీ మే 26,2014 నుంచి ప్రధానిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది నందు నామాజీ ఒక ప్రకటన విడుదల చేస్తూ అప్రతిహతంగా మూడు సార్లు దేశ ప్రధానిగా కొనసాగుతూ చరిత్ర సృష్టింవారని అన్నారు. ఈ మైలు రాయిని ఎవరు దాటే అవకాశం లేదని అన్నారు. చరిత్ర సృష్టించిన ప్రధాని నరేంద్ర మోదీ కి ఆయన శుభాబివందనాలు తెలిపారు. ఇంతటి నేతకు దేశ అభివృద్ధి కోసం దేశ ప్రజలు మరింత అండగా నిలవాలని కోరారు.

## విత్తనాలు కోనేటప్పుడు ప్రతి రైతు రసీదు తీసుకోవాలి
## చీఫ్ లీగల్ ఎయిడ్
## డిఫెన్స్ కౌన్సెల్ కె. లక్ష్మీపతి గౌడ్

నారాయణపేట జూన్ 9విత్తనాలు కొన్న ప్రతి రైతు తప్పకుండా రసీదు తీసుకోవాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ లక్ష్మీపతి గౌడ్ సూచించారు. నారాయణపేట జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం షేర్నపల్లి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించ దం జరిగింది. ఇట్టి విజ్ఞాన సదస్సుకు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మీపతి గౌడ్ హాజరై గ్రామస్తులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల యొక్క భూసార పరీక్షలు చేయించు కొని, పంటల బీమా చేయిం చి, నష్టాలను అధిగమించ వచ్చని తెలిపారు. నిత్యవస ర సరుకుల చట్టం ద్వారా ప్రతి ఒక్క వ్యక్తి తమ యొక్క రసీదులను జాగ్రత్తపర చుకంటే నష్ట పరిహారం పొందే వెసలుబాటు ఉంటుందని అన్నారు. వ్యవసాయం అంటే కేవలం పంటలు పండించడం మాత్రమే కాదు, ఇది ఒక సంస్కృతి, జీవన విధానం. మనకు కావాల్సిన ఆహారా న్ని అందించేది వ్యవసాయ మేఅన్నారు. బాల్యవివాహాలు, బాలకార్మిక చట్టాలు, ఆడ పిల్లలకు చిన్న వయ స్సులో పెళ్లిళ్లు చేయడం నేరమని తెలిపారు. పిల్లలకు చిన్నతనం నుండి మంచి రక్షణ విద్యావకాశాలు కల్పి స్తే, వారి భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది అని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండా లి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ట్రోల్ ఫ్రీ నెంబర్ 15100 కి కాల్ చేసి ఉచిత న్యాయాన్ని పొందవ చ్చు అని తెలియజేశారు. ఇట్టి కార్యక్రమానికి సర్పంచ్ అనురాధ, పంచాయితీ కార్యదర్శి శైలజ అనురాధ ,కానిస్టేబుల్ శ్యామప్ప,అంగన్వాడీ టీచర్ భాగ్యరేఖ,వార్డ్ మెంబెర్స్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అసంపూర్తి రోడును వెంటనే పూర్తి చేయాలనీ
## మాస్ లైన్ ఆందోళన బాట- బి. రాము

నారాయణపేట్నియోజకవర్గం లోని అప్పక్ పల్లి కోటకొండ,కోయిల్ కొండ అసంపూర్తి రోడును వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపడుతున్నట్లు సీపీఐ ఎం ఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి బి.రాము,డివిజన్ కార్యదర్శి కాశినాథ్ తెలిపారు. మంగళవారం నారాయణపేట లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతునారాయణపేట జిల్లా కేంద్రం నుండి మహబూబ్నగర్ జిల్లా కేంద్రాని కలిపే ప్రధానమైన రెండు వరుసల రోడ్డును ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంద న్నారు. కొడంగల్ నియోజక వర్గం రోడ్డు పనులన్నీ వెంట వెంటనే పూర్తవుతాయి. కానీ నారాయణపేట నియోజక వర్గ రోడ్లు ఎందుకు అసంపూ ర్తిగా మిగులుతున్నాయో అర్థం కావడం లేదన్నారు. నారాయణపేట కొడంగల్ రెండు నియోజకవర్గాలు రెండు కళ్ళలాగా నాకు ఉంటాయి అని పిసిసి అధ్యక్ష హోదాలో రేవంత్ రెడ్డి ఎన్నికల సభలో మాట్లాడారనీ గుర్తు చేశారు. కొడంగల్ రోడ్లు మాత్రమే పూర్తి అవుతున్నాయి. కొడంగల్ నియోజకవర్గంలో పని చేస్తే బిల్లులు తొందరగా వస్తాయని కాంట్రాక్టర్లు అక్కడి రోడ్లనే పూర్తి చేస్తున్నారు. నారాయణపేట నియోజకవర్గ రోడ్లను కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదన్నారు. అసంపూర్తిగా పనులు చేశారు. అప్పకుపల్లి నుండి కోటకొండ మధ్యలో నాలుగు కిలోమీటర్లు, కోటకొండ గ్రామంలో రెండు కిలోమీటర్లు, కోటకొండ కోయిలకొండ మధ్యలో ఆరు కిలోమీటర్లు రోడ్డును పూర్తి చేయాల్సి ఉందన్నారు. అధికారులకు, ప్రజాప్రతిని ధులకు ఎన్నిసార్లు విన్న వించినా చలనం లేదని అన్నారు. దీంతో సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 15న ఉదయం 9 గంటలకు కోటకొండ భగత్ సింగ్ విగ్రహం నుండి పాదయాత్ర ప్రారంభమై నారాయణపేట జిల్లా కలెక్టరేట్ కు చేరుకుంటుందన్నారు. 16న నారాయణపేట జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌరస్తా లో రాస్తారోకో, 17న ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని పై మూడు రోజుల అప్పక్ పల్లి, కోటకొండ, కోయిలకొండ రోడ్డు సాధన ఉద్యమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి యాద గిరి, మండల కార్యదర్శి బి నరసింహ, గ్రామ కార్యదర్శి హాజీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రశాంత్, రైతు సంఘం జిల్లా నాయకులు బాలకృష్ణ, టియుసిఐ జిల్లా నాయకులు ఎదురింటి నరసింహులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వెంకట్ రాములు, పి వై ఎల్ నాయ కులు సలీం,మంగలి హనుమంతు, నారాయ ణపేట టౌన్ నాయకులు నజీర్ అహ్మద్, హరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం

- ఓటు హక్కు పరిరక్షణలో బిఎల్‌ఏల పాత్ర కీలకం.
- ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు అప్రమత్తంగా ఉండాలి.
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి.
- విజయవంతంగా ముగిసిన బిఎల్‌ఏల శిక్షణ శిబిరం.




తాండూర్: ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యానికి ప్రాణదారం అని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం తాండూర్ పట్టణంలోని వినాయక కన్వెన్షన్ హాల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "సర్" (స్పెషల్ ఇంటెన్సీ రివిజన్) కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ ఆదేశాల మేరకు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు (బిఎల్ఏ)ల ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా "సర్" రాష్ట్ర కన్వీనర్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ధారసింగ్, టీపీసీసీ నియమించిన ప్రత్యేక ట్రైనర్ వెంకట రమణ , సర్ నియోజకవర్గ కన్వీనర్ పురుషోత్తం రావు, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి పాల్గొని సర్ విధివిధానాలు, ఓటరు జాబితా, సవరణ ప్రక్రియ, బిఎల్ఏల బాధ్యతలు మరియు చేపట్టాల్సిన కార్యాచరణపై సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎంఆర్ మాట్లాడుతూ...ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం.సర్ ప్రక్రియ ప్రజాస్వామ్యంకు ముప్పు.1951-2004 వరకు దాదాపు 8 సార్లు ఓటరు విశ్లేషణ జరిగింది.కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కూడ సర్ ప్రక్రియ జరిగింది, కానీ ఈ సారి జరిగినట్టుగా ఎప్పుడు జరగలేదు అని అన్నారు.బీజేపీ ప్రభుత్వం చెబుతున్నట్లు సర్ ప్రక్రియ అనేది ప్రజాస్వామ్యం బలపడేట్లు జరగడం లేదు, ఈ సారి జరిగే సర్ ప్రక్రియ బీజేపీ ప్రభుత్వం కనుసైగలో ప్రజాస్వామ్యంకు ముప్పు తేచ్చే విధంగా కొనసాగుతుంది అని వెల్లడించారు.సర్ ప్రక్రియలో ముఖ్యంగా నకిలీ ఓట్లు, డబుల్ ఓట్లు తొలగించడం జరగాలి, కానీ ఇప్పటికే సర్ ప్రక్రియ జరిగిన బీహార్, పశ్చిమ బెంగాల్ తో పాటు పలు రాష్ట్రలను మనం గమనిస్తే అక్కడ నకీలీ ఓట్లు, డబుల్ ఓట్లు తొలగించడం ప్రక్కన పెడితే బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించడం పనిగా పెట్టుకున్నారు వ్యాఖ్యానించారు.రాజ్యాంగం బద్దంగా కేంద్రం ఎన్నికల సంఘం పరివేక్షణలో జరిగే సర్ ప్రక్రియ బీజేపీ ప్రభుత్వం కనుసైగలో జరుగుతుంది కావున, మీరు బిఎల్ఎలు, (ప్రజాప్రతినిధులం) దానికి అడ్డు కట్టవేయడానికీ సిద్దంగా ఉండాలి అని ఆదేశించారు.ఇందుకోస ఈ నెల జూన్ 25 నుండి జూలై 24 వరకు బిఎల్ఎలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించాలని తెలిపారు.ఈ నెల రోజుల వ్యవది అనేది మనకి చాల ముఖ్యమైనది. ఈ సమయంలో మన పార్టీ తరుపున నియమించిన బిఎల్ఏ లు వారితో కలిసి పని చేయాల్సిన అవసరం ఉంటుంది.మీ పై పూర్తి నమ్మకం ఉంచి పార్టీ మీకు అవకాశం కల్పించింది. కావున ఓటరు జాబితా పరిశీలనడూప్లికేట్ ఓట్ల గుర్తింపు, అర్హులైన ఓటర్ల నమోదు, చిరునామా మార్పు అనేది పూర్తిగా పార్టీ పరంగా మీరు భాద్యత తీసుకోవాలి అని స్పష్టికరించారు.ముఖ్యంగా సర్ ప్రక్రియ సమయంలో బిఎల్ఎలు ఫోటోలకు పరిమితం కాకుండా పూర్తిస్థాయిలో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని 269 బూత్‌ల దీూాలు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మున్సిపల్ మరియు మార్కెట్ కమిటీ ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వండి.

## -కలెక్టర్, డీఈవోలకు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ విజ్ఞప్తి.



హైదరాబాద్, జూన్ 09 హైదరాబాద్ జిల్లాలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 2026-27 విద్యా సంవత్సరాలలో ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) హైదరాబాద్ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జిల్లా కమిటీ ప్రతినిధులు మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా ను కలిసి వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాని ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలో బాగంగా వారి పిల్లల చదువులకు సహకరించాలని కోరారు. ప్రస్తుతం జిల్లాలో అనేక మంది జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దాదాపు 80 శాతం మంది జర్నలిస్టులు వేతనాలు సరిగా లేక నెలవారీ ఆదాయం లేక వారి పిల్లలను చదివించుకోలేక, కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లల ఫీజులు కట్టలేకపోతున్నారని,ఈ పరిస్థితిలో జర్నలిస్టుల పిల్లలకు ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని వారు కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రాయితీలు అమలు చేయాలని కోరారు. రాబోయే 2026-27 విద్యా సంవత్సరం ఆరంభం అయ్యేనాటికి జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ ను కలిసి వారిలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, కో-కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, ఎం. రవికుమార్, పి. సంతోష్ కుమార్, అడ్వయిజర్ గోవింద్ నాయక్, టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య తదితరులున్నారు. అనంతరం వారు హైదరాబాద్ జిల్లా విద్యాధికారి(డీఈఓ) యాదయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు.

## అపోలో ఫార్మసీ నందు ఉద్యోగాల కొరకు దరఖాస్తులకు ఆహ్వానం

## వికారాబాద్ జిల్లా ఉపాధి కల్పనా అధికారి షేక్ అబ్దుస్ సుభాన్



,వికారాబాద్ :వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయము, ఐటిఐ క్యాంపస్ వికారాబాదు నందు జూన్ 11 గురువారం ఉదయము 10:30 గంటలకు జాబ్ మేళా " ను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అపోలో ఫార్మసీ లో సుమారు 100ం పోస్టులు ఫార్మసిస్ట్ ,ఫార్మసీ అసిస్టెంట్, రిటైల్ ట్రైనీ అసోసియేట్ పోస్టులు వికారాబాద్, హైదరాబాద్ లో ఉన్నాయని వీటికి నిరుద్యోగ యువతీ, యువకులు అందరూ అర్హులని తెలిపారు. ఇట్టి ఉద్యోగానికి పదవ తరగతి, ఇంటర్ డిగ్రీ, బి ఫార్మా,డి-ఫార్మ్ ,ఎం -ఫార్మసీ విద్యా అర్హత కలిగి ఉండాలని ఆయన అన్నారు. ఇట్టి ఉద్యోగాలు వికారాబాద్, హైదరాబాద్ లో ఉన్నాయని ఈ జాబ్ మేళ ద్వారా ఎంపిక అయినా వారికీ నేరుగా ఉద్యోగం కల్పించబడును అని ఆయన అన్నారు.ఇట్టి అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇతర వివరములకు జాబ్ మేళా నిర్వాహకుడు మియా సాబ్ 9676047444 ద్వారా సంప్రదించవచ్చునని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

## విగ్రహావిష్కరణ భూమిపూజను అడ్డుకున్న పోలీసులు

## మిడ్జిల్‌లో ఉద్రిక్తత.. రోడ్డుపై బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులు



మిడ్జిల్ జూన్ 9(:మిడ్జిల్ మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ భర్త మన్నె వెంకట్ రెడ్డి విగ్రహావిష్కరణకు చేపట్టిన భూమిపూజ కార్యక్రమం మంగళవారం ఉద్రిక్తతకు దారితీసింది. ప్రభుత్వ స్థలంలో విగ్రహం ఏర్పాటు కోసం భూమిపూజనిర్వహించేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.భూమిపూజ కార్యక్రమాన్ని నిలిపివేయాలని పోలీసులు సూచించగా, పంచాయతీ కార్యదర్శి, పోలీసు అధికారులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. విగ్రహావిష్కరణ భూమిపూజను ఎందుకు అడ్డుకుంటున్నారంటూ బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండా కార్యక్రమం నిర్వహించరాదని అధికారులు స్పష్టం చేయగా, బీఆర్ఎస్ నాయకులు తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. పలుమార్లు చర్చలు జరిపిన అనంతరం పరిస్థితి సద్దుమణిగింది. చివరకు ప్రభుత్వ స్థలంలో కాకుండా సొంత స్థలంలోనే విగ్రహావిష్కరణకు సంబంధించిన భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించుకుని బీఆర్ఎస్ నాయకులు అక్కడి నుంచి వెనుదిరిగారు మండల కేంద్రంలో జరిగిన ఈ ఘటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది..ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుదర్శన్, జిల్లా నాయకులు బాల్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శశిరేఖ, బాలు, శ్రీనివాస్ గౌడ్, గంజి కృష్ణ, గంజి శేఖర్, శ్రీనివాసులు, అయ్యప్ప రెడ్డి, నారాయణరెడ్డి, జంగా రెడ్డి, కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురిని కాపాడి అమరుడైన అనురూప్.

## ఆయన కుటుంబానికి అండగా ఉంటాం.

భువనగిరి ఎంపీ చామల, ఎమ్మెల్యే మల్ రెడ్డి.

అమెరికా నుంచి స్వగ్రామానికి మృతదేహం.

ఎంపీ చామల, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి, మందుల సామెల్ నివాళి.



రంగారెడ్డి జిల్లా : అమెరికాలోని సెబాన్ నదిలో ముగ్గురిని కాపాడి ప్రాణాలు కోల్పోయిన అనురూప్ రెడ్డి మృతదేహానికి భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ నివాళి అర్పించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లికి చెందిన కోడూరు రాజేందర్‌రెడ్డి దుర్గాభవాని దంపతుల చిన్న కుమారుడు అనురూప్ రెడ్డి రెండేళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ చేసి వారం రోజుల్లో ఉద్యోగంలో చేరాల్సి ఉండగా గత నెల 30న స్నేహితులతో కలిసి లూసియానాలోని టోరోడో పార్కు వద్ద సెబాన్ నది వద్దకు వెళ్లారు. ముగ్గురు స్నేహితులు లోతులోకి వెళ్లి నీటిలో మునగగా అనురూప్ వారిని ఒడ్డుకు లాగి తాను వస్తుండగా నదిలో వేసిన ఓ వల అతడి కాళ్లకు చుట్టుకుంది. ఈ క్రమంలోనే నీటమునిగి అనురూప్ ప్రాణాలు కోల్పోయారు. 10 రోజుల తర్వాత యువకుడి మృతదేహం కవాడిపల్లికి చేరుకోగా గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.అనురూప్ మృతదేహం పై పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించిన ఎంపీ చామల, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, మందుల సామెల్ శోకసంద్రంలో ఉన్న కుటుంబసభ్యులను ఓదార్చారు. యువకుడి త్యాగానికి గుర్తుకు సీఎం రేవంత్ రెడ్డి పంపిన కమెండేషన్ లెటర్ ను వారు కుటుంబసభ్యులకు అందజేశారు. అనురూప్ సమయస్ఫూర్తితో ముగ్గురిని కాపాడినా తాను ప్రాణాలు కోల్పోవటం దురదృష్టకరమన్నారు. అనురూప్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.

## హైదరాబాద్ కార్యక్రమానికి మహాలక్ష్మి సంఘం సభ్యుల ప్రయాణం



మిడ్జిల్ జూన్ 9రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఆధ్వర్యంలో మిడ్జిల్ మండల మహిళా సంఘాల సభ్యులకు హైదరాబాద్‌లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమానికి హాజరుకావడానికి మంగళవారం బస్సు సౌకర్యం కల్పించారు.ఈ సందర్భంగా మహాలక్ష్మి సంఘం సభ్యులు ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు స్వాతి, అఫ్షున్నిసా బేగం, లక్ష్మీదేవి, ఏపీఎం హైమావతి, సీసీలు మంగమ్మ, రవి, వెంకట్, కానిస్టేబుల్ ప్రశాంతి, ఆశా వర్కర్ గీత తదితరులు పాల్గొన్నారు.అలాగే మండల పరిధిలోని మహాలక్ష్మి సంఘాలతో పాటు ఇతర మహిళా సంఘాల సభ్యులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహిళల అభివృద్ధి, సాధికారత కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా పలువురు ప్రశంసించారు.

## ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులు నియంత్రించాలి.

## అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలల పై చర్యలు తీసుకోవాలి.

ప్రైవేట్ పాఠశాలలో స్టేషనరీ బుక్స్ విక్రయించారదు.

ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి.



కర్నూల్ జిల్లా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాగర్ కర్నూల్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ మరియు ప్రైవేటు కళాశాలల సమస్యలను పరిష్కరించాలని వీజూ డి. కుర్మయ్య ని కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది. పాఠశాలల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలు, ఫీజుల భారం, ఉపాధ్యాయుల కొరత, విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని కోరడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంగన మోని బంగారు బాబు మాట్లాడుతూ..... ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, తాగునీటి సమస్య, మరుగుదొడ్లు, ఫర్నిచర్ మరియు ఇతర విద్యా సౌకర్యాల లోపంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన మొదటి రోజునే విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్లు మరియు ఇతర విద్యా సామగ్రి అందేలా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చారు.అలాగే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని పేర్కొన్నారు. యూనిఫామ్ లు, బస్సు ఫీజులు, స్పెషల్ ఫీజులు, పుస్తకాల ఫీజులు, మరియు వివిధ బ్రాండ్ల పేర్లతో వేల నుంచి లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. విద్య హక్కు చట్టం ఆర్టీఈ ప్రకారం ప్రైవేట్ పాఠశాలలో 25% ఉచిత సీట్లు కేటాయింపును తప్పనిసరిగా అమలు చేసి పేద మరియు బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేసి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న విద్యాసంస్థలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలు నిబంధనల ప్రకారం వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.విద్యార్థుల హక్కుల కోసంఏబీవీపీ ఎల్లప్పుడూ పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రసాద్ కుమార్, నగర సంయుక్త కార్యదర్శి శివ, శివ, జీవన్, విష్ణు, రమేష్ ఏబీవీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సమావేశానికి తోగుట మండలం నుంచి ప్రత్యేక బస్సులో మహిళా సంఘాల ప్రతినిధుల ప్రయాణం



తోగుట జూన్ 09: తోగుట మండల సమైక్యకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక బస్సును కేటాయించింది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ముఖ్యమంత్రి సమావేశానికి మండలంలోని మహిళా సంఘాల ప్రతినిధులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన ఎంఎస్, ఓబీఎస్ సభ్యులు, గ్రామ సంఘాల ఓబీఎస్‌లు, ఏపీఎంలు, సీసీలు, ఎంఎస్ఏ, ఎంసీఓలు, వీఓఏలు ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరారు. ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధి, సాధికారతకు ప్రాధాన్యత ఇస్తోందని, వారి అభిప్రాయాలు తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న సమావేశంలో పాల్గొనేందుకు ప్రతినిధులు ఉత్సాహంగా వెళ్లారు.మండల సమైక్యకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయడం పట్ల మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశం ద్వారా మహిళా సంఘాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించనున్నట్లు వారు పేర్కొన్నారు.



## వైభవంగా జన్మదిన వేడుకలు




మిడ్జిల్ జూన్ 9(:మిడ్జిల్ మండలకేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో బరిగెల శోభారాణి -- ప్రకాష్ దంపతుల కుమారుని జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జడ్చర్ల ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే తల్లీ , మాజీ జెడ్పీటీసీ గౌస్ రబ్బానీ, సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా అతిథులు కేక్ కట్ చేసి చిన్నారిని ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులు అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## సిద్దిపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌పై ఆకస్మిక తనిఖీ.. ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బలోపేతానికి ఏసీపీ సుమన్ కుమార్ ఆదేశాలు



సిద్దిపేట జిల్లా ప్రతినిధిజూన్ 9:సిద్దిపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ట్రాఫిక్ ఏసీపీ ఎం. సుమన్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ, ట్రాఫిక్ అమలు చర్యలను సమీక్షించారు.తనిఖీల సందర్భంగా స్టేషన్‌లోని వసతులు, సిబ్బంది హాజరు, పనితీరు, పట్టణంలో కొనసాగుతున్న ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే ఈ-చలాన్ రికార్డులు, ప్రమాదాల రిజిస్టర్లు, పరిపాలనా పత్రాలు, పెండింగ్ కేసుల వివరాలను నిశితంగా తనిఖీ చేశారు.స్టేషన్ రికార్డుల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఏసీపీ, పరిశుభ్రతను నిరంతరం పాటించాలని సూచించారు. స్టేషన్‌లో అందుబాటులో ఉన్న సాంకేతిక పరికరాల పనితీరును కూడా పరిశీలించి వాటిని సమర్థవంతంగా వినియోగించాలని అధికారులకు సూచించారు.పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలను మరింత బలోపేతం చేయాలని, రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఈ-చలాన్లు, ఇతర పరిపాలనా అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు.ప్రజలకు సురక్షితమైన రవాణా వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ట్రాఫిక్ శాఖ మరింత సమర్థవంతంగా పనిచేయాలని ట్రాఫిక్ ఏసీపీ ఎం. సుమన్ కుమార్ పేర్కొన్నారు.



## మహిళల భద్రతే షీ టీమ్ లక్ష్యం దేశాయ్ బీడీ కంపెనీలో అవగాహన సదస్సు





సిద్దిపేట జిల్లా ప్రతినిధి జూన్ 9:మహిళలు, విద్యార్థినులు, బాలికల రక్షణే లక్ష్యంగా తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలోని షీ టీమ్స్ నిరంతరం పనిచేస్తున్నాయని సిద్దిపేట ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎ.బి. దుర్గ తెలిపారు.మంగళవారం సిద్దిపేట పట్టణంలోని దేశాయ్ బీడీ కంపెనీలో జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో మహిళా కార్మికులు, సిబ్బందికి ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్స్పెక్టర్ దుర్గ మహిళల హక్కులు, భద్రతా చట్టాలు, న్యాయ పరిరక్షణ అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్, కార్యాలయాల్లో వేధింపులు, సోషల్ మీడియా ద్వారా జరిగే వేధింపుల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, మానవ అక్రమ రవాణా వంటి అంశాలు చట్టరీత్యా నేరాలని, వాటి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.చిన్నారులకు 'గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్' గురించి తల్లిదండ్రులు తప్పనిసరిగా అవగాహన కల్పించాలని, పెరుగుతున్న సైబర్ నేరాలు, సైబర్ బుల్లీయింగ్ నుంచి రక్షణ కోసం జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.మహిళలు ఎలాంటి వేధింపులు లేదా సమస్యలు ఎదుర్కొన్నా అధైర్యపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 100 నంబర్‌కు లేదా సిద్దిపేట షీ టీమ్ హెల్ప్‌లైన్ 8712667434కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదు దారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఇన్స్పెక్టర్ ఎ.బి. దుర్గ స్పష్టం చేశారు.

## రైతులకు మరింత చేరువగా సహకార బ్యాంకింగ్ సేవలు...

### మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఏదులాపురం మునిసిపల్ పరిధిలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్ కరుణగిరి నూతన శాఖ ప్రారంభం



ఖమ్మం, జూన్ 9::రైతులకు మరింత చేరువగా సహకార బ్యాంకింగ్ సేవలు అందనున్నాయని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.ఏదులాపురం మునిసిపల్ ప్రాంతంలోని కరుణగిరిలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్ (డీసీసీబీ) నూతన శాఖను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రైతులు, స్వయం సహాయక సంఘాలు, చిన్న వ్యాపారులు, సాధారణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడంలో ఈ నూతన శాఖ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సహకార బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు నాణ్యమైన ఆర్థిక సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.సహకార రంగం అభివృద్ధి చెందితే రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతారని, వ్యవసాయ రుణాలు, పొదుపు పథకాలు, ఇతర బ్యాంకింగ్ సేవలు ప్రజలకు సత్వరంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రులు వెల్లడించారు. డీసీసీబీ విస్తరణతో స్థానిక ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., సిపి సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ నవీన్, డీసీఓ గంగాధర్, ప్రజా ప్రతినిధులు, రైతులు, సంబంధిత అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## ఎరువుల స్టాక్ పాయింట్లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (, జూన్ 09 : జిల్లాలో ఎరువుల గిడ్డంగులు, విక్రయ కేంద్రాలను వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం



అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి అన్ని మండలాల తహసిల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సాఫీగా యూరియా, ఇతర ఎరువుల పంపిణీ జరిగేలా క్షేత్రస్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని సూచించారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా క్రాప్ బుకింగ్ కలిగి ఉన్న రైతులకే పంట సాగు విస్తీర్ణానికి అనుగుణంగా నిర్ణీత పరిమాణంలో బుకింగ్ యాప్ ద్వారా ఎరువులు పంపిణీ చేయాలని సూచించారు. బ్యాక్ వాటర్ ఏరియాలోని భూములను ప్రభుత్వం భూసేకరణ జరిపి నష్టపరిహారం చెల్లించినందున, అలాంటి భూములలో పంటలు సాగు చేసే వారికి క్రాప్ బుకింగ్ చేయకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం అందించే సబ్సిడీలు, ఇతర ప్రయోజనాలను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా పంట భూమి కలిగిన ప్రతి రైతు తప్పనిసరిగా క్రాప్ బుకింగ్ చేసుకునేలా చూడాలన్నారు. కాగా, ఆయా గ్రామాలలో అంగన్వాడి భవనాలు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలకు అనువైన స్థలాలను గుర్తిస్తూ, త్వరితగతిన కేటాయించాలని తహసిల్దార్లను ఆదేశించారు. ఎక్కడ కూడా స్థలం అందుబాటులో లేనందున నిధులు వెనక్కి మళ్ళిపోకుండా చొరవ చూపాలని అన్నారు. ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియ (ఎస్.ఐ.ఆర్) అమలుకు సంబంధించి బీ.ఎల్.ఓలు, బీ.ఎల్.ఏలకు ఆయా విడతలలో అందించనున్న శిక్షణ కార్యక్రమాలలో సహాయ ఈ.ఆర్.ఓలు, బీ.ఎల్.ఓ సూపర్వైజర్లు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్ ప్రీ-మ్యాపింగ్ పై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, నిర్ణీత షెడ్యూల్ ను అనుసరిస్తూ జన గణన ప్రక్రియ పక్కాగా జరిగేలా నిశిత పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరస్వామి, ఆయా మండలాల తహసిల్దార్లు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ చైర్మన్‌గా మాచిపెద్ది శివకుమార్

సేవలకు గుర్తింపుగా కీలక బాధ్యతలు అప్పగింపు



నాగర్ కర్నూల్ జిల్లా నాగర్‌కర్నూల్,తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ నూతన చైర్మన్‌గా నాగర్‌కర్నూల్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, ఆర్యవైశ్య సంఘం నాయకుడు మాచిపెద్ది శివకుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ చైర్మన్ అమరవాది లక్ష్మీనారాయణ తన కార్యాలయంలో శివకుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి నూతన బాధ్యతలను అప్పగించారు. మాచిపెద్ది శివకుమార్ పట్టణ, జిల్లా స్థాయిలో ఆర్యవైశ్య సంఘం కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ సేవలందిస్తున్నారు. ఆర్యవైశ్యులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఇటీవల అమరవాది లక్ష్మీనారాయణ రాష్ట్ర చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం, నాగర్‌కర్నూల్ జిల్లా మహాసభ ఎన్నికల నిర్వహణ చైర్మన్‌గా శివకుమార్‌ను నియమించారు. ఆ బాధ్యతల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా పర్యటించి మండల స్థాయి కార్యవర్గాల ఏర్పాటుకు కృషి చేశారు. అలాగే ఇటీవల నాగర్‌కర్నూల్ పట్టణ ఎన్నికల కన్వీనర్‌గా వ్యవహరిస్తూ ఆర్యవైశ్య సంఘం ఎన్నికలను విజయవంతంగా నిర్వహించారు.ఆయన సేవలు, సంఘం అభివృద్ధికి చేసిన కృషిని గుర్తించిన రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకత్వం విద్యా కమిటీ చైర్మన్ పదవిని అప్పగించింది.ఈ నియామకంపై ఆయన మిత్రులు, శ్రేయోభిలాషులు, వ్యాపారవేత్తలు, ఆర్యవైశ్య సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు

# ప్రతి స్టాక్ పాయింట్ లో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా బుకింగ్ యాప్ ద్వారా ప్రణాళికాబద్ధంగా పంపిణీ

కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి



నిజామాబాదు జిల్లా ప్రతినిధి జూన్ 09 : జిల్లాలో ఎరువుల గోడౌన్లు, విక్రయ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం తనిఖీ చేశారు. నానో యూరియా వినియోగాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించండని,రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలోని అన్ని సహకార సంఘాల గోడౌన్లలో, సేల్ పాయింట్లలో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా పర్యవేక్షణ చేస్తున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. వానాకాలం సీజన్ పంటల సాగుకు అవసరమైన మేరకు పూర్తి స్థాయిలో ఎరువుల నిల్వలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళనకు గురి కావద్దని సూచించారు. ఎడపల్లి మండలంలోని జానకంపేట్, ఎడపల్లి లో గల ఎరువుల



గిడ్డంగులు, విక్రయ కేంద్రాలను కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. గోడౌన్లలో నిల్వ ఉన్న యూరియా, ఇతర ఎరువులను పరిశీలించి, స్టాక్ వివరాల రిజిస్టర్ లో పొందుపరచిన వాటికి అనుగుణంగా నిల్వలు అందుబాటులో ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎన్ని ఎరువుల బస్తాలు వచ్చాయి, ఎన్ని పంపిణీ చేశారు, ఇంకనూ ఎంత పరిమాణంలో నిల్వలు రావాల్సి ఉంది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. యూరియా బుకింగ్ యాప్ పనితీరును కలెక్టర్ స్వయంగా పరిశీలన జరిపి, యాప్ వల్ల సమకూరే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. మన రాష్ట్రంలో అమలు అవుతున్న బుకింగ్ యాప్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఎరువుల పంపిణీ కోసం అమలు చేస్తున్నాయని అన్నారు. ఈ యాప్ వల్ల ఎలాంటి నష్టం లేదని, గత రబీ సీజన్లో కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఎరువులు పక్కదారి పట్టకుండా, పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా యూరియా పంపిణీకి బుకింగ్ యాప్ దోహదపడుతుందని, దీని విషయంలో రైతులు అపోహలకు గురి కావద్దని సూచించారు. నానో యూరియా వాడకం వల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రయోగాత్మకంగా కొంత పరిమాణంలో నానో యూరియాను వినియోగించి ఫలితాలను స్వయంగా పరిశీలించాలని రైతులకు హితవు పలికారు. అయితే రైతులను నానో యూరియా కొనాలని బలవంతం చేయవద్దని, వారు కోరిన ఎరువులు మాత్రమే అందించాలని, ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, డీలర్ల లైసెన్సులు రద్దు చేసేందుకు కూడా వెనుకాడబోమని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. జిల్లా రైతుల అవసరాలకు సరిపడా ప్రస్తుతం 27 వేల మెట్రిక్ టన్నుల పైచిలుకు యూరియా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడ కూడా కొరత ఏర్పడకుండా రైతుల అవసరాలకు అనుగుణంగా అన్ని ప్రాంతాలకు నిల్వలను చేరవేస్తున్నామని తెలిపారు. పలు సొసైటీలు డిఫాల్ట్ లో ఉండగా, వాటి పరిధిలోని రైతులకు సైతం ఇబ్బందులు తలెత్తకూడదని, స్థానికంగానే వారికి ఎరువులు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశ్యంతో డీ.సీ.ఎం.ఎస్ ద్వారా ఎరువుల పంపిణీ జరిపిస్తున్నామని అన్నారు. ఒకింత ముందుగానే పంటలు విత్తుకునే బోధన్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే రైతులకు ఎరువుల పంపిణీ ప్రక్రియను ప్రారంభించడం జరిగిందని, తదుపరి నిజామాబాద్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలలో కూడా పక్కాగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకున్నామని, స్టాక్ పాయింట్లకు ఎరువుల నిల్వలు చేరవేశామని కలెక్టర్ వివరించారు. మోతాదుకు మించి ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగించకుండా, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ దత్తాద్రి, జానకంపేట్ సర్పంచ్ అనురాధ, సొసైటీ చైర్మన్ నరేందర్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## అక్రమ మట్టి దందా అడ్డుకున్న ఆర్ఐ పై దౌర్జన్యం

### కారు తాళాలు లాక్కొని గంటలపాటు నిర్బంధం



ఖమ్మం జిల్లా, కారేపల్లి : లోకల్ గైడ్, జూన్ 9 : మండల పరిధిలోని కొత్త తండా గ్రామ గ్రామపంచాయతీ సమీప గుట్ట ప్రాంతంలో రెండు రోజులుగా కొనసాగుతున్న అక్రమ మట్టి తరలింపును అడ్డుకునేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారులపై దౌర్జన్యానికి పాల్పడిన ఘటన మంగళవారం ఉద్రిక్తతకు దారితీసింది. స్థానికుల సమాచారం మేరకు, తహసీల్దార్ ఆదేశాలపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) ఆలీ అక్బర్, జీపీఓ బంపర్, భాస్కర్ తదితర సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమంగా మట్టి తరలింపు జరుగుతున్నట్లు గుర్తించిన అధికారులు ట్రాక్టర్లను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు, వారి అనుచరులు రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. ఆర్ఐ ప్రయాణిస్తున్న కారు తాళాలను బలవంతంగా లాక్కొని, నువ్వెవడివి? అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో ఘటన స్థలంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గంటలపాటు నిర్బంధించడంతో పరిస్థితి విషమించడంతో ఆర్ఐ ఆలీ అక్బర్ తహసీల్దార్‌కు సమాచారం అందించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పి నట్లు తెలిసింది. ఈ ఘటనపై ఆర్ఐ ఆలీ అక్బర్ మాట్లాడుతూ.. అక్రమ మట్టి తరలింపు జరుగుతోందన్న సమాచారం మేరకు తాము మాదారం కొత్త తండా ప్రాంతానికి వెళ్లినట్లు తెలిపారు. విధులు నిర్వర్తిస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు కారు తాళాలు లాక్కొని తమను వెళ్లనీయకుండా అడ్డుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా తనను ఎమ్మెల్యే పీఏతో మాట్లాడించారని, కారు తాళాలు లాక్కోవడం సరికాదని తాను చెప్పగా ఎమ్మెల్యే పి.ఏ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అక్రమంగా నడుస్తున్న ట్రాక్టర్లను అక్కడి నుంచి పంపించిన అనంతరం, పోలీసులు చేరుకున్న తర్వాతే తాళాలు తిరిగి అప్పగించినట్లు పేర్కొన్నారు. విధులకు ఆటంకం కలిగచడం, ప్రభుత్వ అధికారిపై దౌర్జన్యనీకి పాల్పడడం వంటి అంశాలపై సంబంధిత వ్యక్తులపై పోలీసులకు పిర్యాదు చేయనున్నట్లుగా ఆర్ఐ వెల్లడించారు. సహజ వనరుల పరిరక్షణ కోసం చర్యలు చేపడుతున్న ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం స్థానికంగా చర్చనియాషంగా మారింది.

## జర్నలిస్టుల పిల్లల ఫీజు రాయితీపై మంత్రి పొంగులేటి హామీ



ఖమ్మం టీడబ్ల్యూజేఎఫ్ వినతిపై స్పందించిన మంత్రికలెక్టర్, డీఈవోలకు సూచిస్తానని వెల్లడిఖమ్మం : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్ - హెచ్ - 2843) ఖమ్మం జిల్లా కమిటీ విజ్ఞప్తిపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించారు. ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 50 % ఫీజు రాయితీ కల్పించాలని టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ స్థానిక ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్ లో మంగళవారం వినతిపత్రం సమర్పించింది. దీనిపై స్పందించిన మంత్రి జిల్లా కలెక్టర్, డీఈవోలకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. టీడబ్ల్యూజేఎఫ్ వినతిపత్రాన్ని కలెక్టర్ కు పంపాల్సిందిగా తన వ్యక్తిగత సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. జర్నలిస్టుల్లో చాలామంది పేదలు, మధ్యతరగతి వర్గానికి చెందినవారని, చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని టీడబ్ల్యూజేఎఫ్ వినతిపత్రంలో పేర్కొంది. అనేక మంది జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారు కాబట్టి వారిని అవకాశం ఉన్న మేరకు ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉన్నదని జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు దువ్వా సాగర్ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు సామాన్యునికి అందుబాటులో లేవని అన్నారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టులు తమ పిల్లలను చదివించుకోవటం భారం అవుతోందని పేర్కొన్నారు . ప్రతీ ప్రైవేటు, కార్పొరేటు విద్యాసంస్థల్లో సెక్షన్ కు నలుగురు చొప్పున పేద విద్యార్థులకు ఉచిత బోధనాభ్యాస అవకాశం కల్పించాలనే నిబంధన ఉన్నా ఏ ఒక్కచోటా ఇదీ సక్రమంగా అమలు అవుతున్న దాఖలాలు లేవన్నారు. పేద, మధ్యతరగతి వర్గానికి చెందిన జర్నలిస్టుల పిల్లల విషయంలోనైనా ఇదీ అమలయ్యేలా చూడాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రతీ ప్రైవేటు, కార్పొరేటు పాఠశాల, కళాశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇచ్చేలా... సమాచార శాఖ మంత్రిగా ప్రభుత్వం తరపున ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరడంతో ఈ మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారికి ప్రభుత్వం నుంచి తగు ఆదేశాలు జారీ చేయిస్తానని మంత్రి స్పష్టతనిచ్చారు. మంత్రికి వినతిపత్రం సమర్పించిన వారిలో టీబీజేఏ జిల్లా అధ్యక్షులు ఆవుల శ్రీనివాస్, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు మారెడ్డి నాగేందర్ రెడ్డి, మధుశ్రీ, జానీపాష, యాకేష్, గణేష్, పెంద్ర అంజయ్య, కొమిరె నాగేశ్వరరావు, అర్షద్, ఫయాజ్, యాకూబ్ పాష, శరత్, యూసుఫ్, యాస లక్ష్మారెడ్డి, డి. రవికుమార్, కొరకొప్పుల రాంబాబు, కరణబాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యాన్ని త్వరగా అన్ లోడ్ చేసుకోవాలి.

-- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి..



వనపర్తిజూన్ 9 గోదాములు, మిల్లుల వద్ద వరి ధాన్యాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరగా అన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ శ్రీరంగాపురం మండలం పరిధిలోని లక్ష్మి వారహి ఇండస్ట్రీ, పెబ్బేరు పరిధిలో రాధాకృష్ణ ఇండస్ట్రీస్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా మిల్లుల గోదాముల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గోదాములు, మిల్లుల వద్ద వరి ధాన్యాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరగా అన్‌లోడ్ చేసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లుల్లో వేగంగా దించుకోవాలని స్పష్టం చేశారు. లారీలలో ఉన్న ధాన్యం పై టార్పాలిన్లు కప్పి ఉంచాలన్నారు. మిల్లుల వద్ద లారీలను ఎక్కువ సమయం వేచి ఉంచకుండా తగ్గించేందుకు గాను హమాలీల (కార్మికుల) సంఖ్యను పెంచుకోవాలని మిల్లర్లకు చెప్పారు.




మిల్లుకు వచ్చిన ధాన్యం లారీలను ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేస్తూ రోజువారీ అన్లోడ్ సామర్థ్యాన్ని పెంచాలని, ఎక్కడా లారీలు ఎక్కువ సమయం వేచి ఉండకుండా చూడాలని అధికారులను, మిల్లర్లను ఆదేశించారు. ఇంకా ధాన్యం నిల్వ చేయడానికి గోదాములను సిద్ధం చేయాలని పౌర సరఫరాల అధికారికి సూచించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, రెవెన్యూ అధికారులు, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## స్కూల్ బస్సులు , ప్రైవేట్ బస్సుల ఫిట్నెస్ తనిఖీలు నిర్వహించాలి

ఖమ్మం జిల్లా రవాణా శాఖ అధికారి జేఎన్ శ్రీనివాస్ కి వినతిపత్రం ఖమ్మం జిల్లాలో నడుస్తున్న స్కూల్ బస్సులు మరియు ప్రైవేట్ బస్సులను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి , భద్రతా ప్రమాణాలు పాటిస్తున్న వాహనాలకు మాత్రమే ఫిట్నెస్ సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్ టిడబ్ల్యుఎఫ్ - సీఐటీయూ) ఖమ్మం జిల్లా కమిటీ అధ్యక్షుడు వై విక్రమ్ , కార్యదర్శి జిల్లా ఉపేందర్ లు ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీవో జిల్లా కార్యాలయంలో జిల్లా రవాణా శాఖ అధికారి జేఎన్ శ్రీనివాస్ కి వినతిపత్రం అందజేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో విద్యార్థులు మరియు సాధారణ ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని స్కూల్ బస్సులు , ప్రైవేట్ బస్సులపై ప్రత్యేక తనిఖీ డ్రైవ్ నిర్వహించాలని కోరారు . వాహనాల బ్రేకులు , టైర్లు , అత్యవసర ద్వారాలు , ఫస్ట్ ఎయిడ్ బాక్స్ , ఫైర్ ఎక్స్టింగ్విషర్ , బీమా పత్రాలు , అనుమతులు మరియు ఇతర భద్రతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హత కలిగిన వాహనాలకు మాత్రమే ఫిట్నెస్ సర్టిఫికెట్లు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు . ప్రమాదాలు జరగకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలి అని కోరారు . ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జరుపుల ప్రమీల , మధు , టి. రాంబాబు లు పాల్గొన్నారు . అలాగే యూనియన్ నాయకులు ఏఐఆర్ టిడబ్ల్యుఎఫ్ - సీఐటీయూ ఖమ్మం జిల్లా ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ల యూనియన్ జిల్లా నాయకులు శ్రీనివాస్ , నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

శివసూర్య
SHIVA SURYA TELUGU DAILY
RNI APTEL : 2023/88704
తెలుగు దిన పత్రిక

జనరల్ న్యూస్

బుధవారం -10- జూన్- 2026

# ఇందిరమ్మ ఇళ్ల పేరుతో డబ్బులు వసూలు చేసే దళారులను నమ్మొద్దు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్ నాయుడు



భద్రాద్రి జిల్లా, చర్ల : :ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తుందని చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ నాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ, ఇళ్ల మంజూరు పేరుతో ప్రజలను మోసం చేసే దళారులను నమ్మి ఎవరూ డబ్బులు చెల్లించవద్దని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పూర్తిగా ప్రభుత్వ నిబంధనలు, అర్హత ప్రమాణాల ఆధారంగానే జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇల్లు మంజూరు చేయిస్తామని చెప్పి డబ్బులు డిమాండ్ చేసే వ్యక్తులను నమ్మరాదని, అలాంటి ఘటనలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని విజయ్ నాయుడు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిజమైన లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నేడే పుట్టపాగ మహేంద్రనాథ్ శత జయంతి ఉత్సవాలు

## జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ భవనంలో ఉత్సవాలు



నాగర్ కర్నూల్ జిల్లా నాగర్ కర్నూల్ :మాజీ మంత్రి పుట్టపాగ మహేంద్రనాథ్ శత జయంతి ఉత్సవాలను నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో జూన్ 10వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పుట్టపాగ మహేంద్రనాథ్ శత జయంతి ఉత్సవాల కమిటీ కన్వీనర్ పుట్టపాగ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర పర్యాటక సంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు , పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి, ఎమ్మెల్సీ కుచుకుల దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి. హాజరవుతారని శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి.ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ సి.ఖాసీమ్ అధ్యక్షత వహిస్తారు. ఈ సందర్భంగా సమాజానికి విశిష్ట సేవలందించిన ప్రముఖ వృద్ధులు, పౌరులు, సామాజిక సేవకులు, వివిధ రంగాలలో విశేష కృషి చేసిన ప్రముఖులను పుట్టపాగ మహేంద్రనాథ్ స్మారకార్థం ఘనంగా సన్మానించి గౌరవించనున్నట్లు వివరించారు. ఈ శతాబ్ది ఉత్సవాలకు మేధావులు, రాజకీయ నాయకులు, ప్రజలు. అయన అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని మహేందర్ నాథ్ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని పుట్టపాగ శ్రీనివాస్ కోరారు.

# ప్రజల ఆరోగ్యమే మా లక్ష్యం - గ్రామ అభివృద్దే నా ధేయం

-సీజనల్ వ్యాధులపట్ల ముందస్తు చర్యలు చేపడతాం

-భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హిరలాల్




ఖమ్మం జిల్లా, కారేపల్లి : జూన్ 9 : రానున్న వర్షాకాలమును దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కలిపిస్తూ ముందస్తు చర్యలు తీసుకోవాలని భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్ అన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామం లో పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించాకుండా గ్రామ వీధుల్లో, సైడ్ డ్రైనేజిలో మురుగు నీరు లేకుండా చర్యలు చేపట్టాలని , దీనికి ప్రజలు కూడా తమ వాంతు భాద్యతయుతంగా మేలగాలని పాలక వర్గ సమావేశం లో సర్పంచ్ బానోత్ హీరాలాల్ అన్నారు." ప్రజల ఆరోగ్యమే లక్ష్యం - గ్రామ అభివృద్దే మా ధేయంగా " పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్ , ఉప సర్పంచ్ భిక్కులాల్ , వార్డ్ సభ్యులు వీ.గాంధీ , సంధ్య , భూలి , మహేష్ , దేవి , జ్యోతి , అంకి , పంచాయతి సిబ్బంది రాందాస్ , హేంచంద్ తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి పట్టణం - వేశ్యకాంతుల చెరువు -'



సత్తుపల్లి') సత్తుపల్లి పట్టణం, వేశ్యకాంతుల చెరువు ప్రాంతం లో సర్వే చేసి ప్రభుత్వ భూమి ని గుర్తించాలి అని సత్తుపల్లి వీ=ా రెవిన్యూ అధికారులను ఆదేశించిన.... తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు మరియు సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీమతి డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ యుద్ధ ప్రాతిపదికన సర్వే చెయ్యాలి అని, ప్రభుత్వ భూమి ని గుర్తించి అట్టి భూములను ఈ



కాంగ్రెస్ ప్రభుత్వంభూమి లేని పేద ప్రజలకు అందించే దిశగా సత్తుపల్లి నియోజకవర్గం మీూా రాగమయిగారు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఆధ్వర్యంలో జరుగుతుంది అని తెలియజేసారు.... ఈ కార్యక్రమం లో రెవిన్యూ అధికారులు,సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహన బేగం కమల్ పాషా, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, రైతులు, సత్తుపల్లి మున్సిపల్ కౌన్సిలర్స్, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు..

# రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాల ఎంట్రీ

-జోగులాంబ గద్వాల జిల్లా మీదుగా ప్రవేశం..మరో రెండు, మూడు రోజులలో తెలంగాణ అంతటా విస్తరణ

-వారం రోజుల పాటు వర్షాల జోరు..పలు జిల్లాలకు ఐఎండీ ఎల్లో అలర్ట్



హైదరాబాద్, జూన్ 9 : తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా రైతులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. జూన్ 4న కేరళ తీరాన్ని తాకిన రుతుపవనాలు సోమవారం మృగశిర కార్తె రోజున జోగులాంబ గద్వాల జిల్లా మీదుగా తెలంగాణలోకి అడుగుపెట్టడం విశేషంగా మారింది. వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టే మృగశిర కార్తె రోజునే రుతుపవనాలు రాష్ట్రంలోకి రావడం రైతాంగంలో ఆనందాన్ని నింపుతోంది. వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించిన వివరాల ప్రకారం, గత ఏడాదితో పోలిస్తే ఈసారి నైరుతి రుతుపవనాలు సుమారు ఎనిమిది రోజుల ఆలస్యంగా తెలంగాణలోకి ప్రవేశించాయి. అయితే ప్రస్తుతం ఏర్పడిన అనుకూల వాతావరణ పరిస్థితుల కారణంగా రాబోయే రెండు నుంచి మూడు రోజులలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు రుతుపవనాలు విస్తరించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. రుతుపవనాల ప్రభావంతో ఇప్పటికే రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. గత కొన్ని రోజులుగా ఎండల తీవ్రతతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు ఉపశమనం లభిస్తోంది. ముఖ్యంగా దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదవుతున్నాయి. కొన్ని ప్రాంతాలలో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురుస్తుండటంతో వాతావరణం పూర్తిగా మారిపోయింది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రాబోయే వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని జిల్లాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశాలు ఉన్నందున ఐఎండీ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు, రైతులు, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రుతుపవనాల రాకతో వ్యవసాయ కార్యకలాపాలు ఊపందుకునే అవకాశం ఉంది. ఇప్పటికే వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. చెరువులు, కుంటలు, జలాశయాలకు నీటి ప్రవాహం పెరిగే అవకాశముండటంతో సాగునీటి పరిస్థితులు కూడా మెరుగుపడనున్నాయి. మరోవైపు భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగాలు అప్రమత్తమయ్యాయి. లోతట్టు ప్రాంతాలలో నీటిమునిగే పరిస్థితులు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాయి. విద్యుత్, రహదారులు, తాగునీటి సరఫరా వంటి కీలక సేవలకు అంతరాయం కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రుతుపవనాల పూర్తి స్థాయి విస్తరణతో తెలంగాణలో ఖరీఫ్ సీజన్‌కు శుభారంభం కానుందని, రాబోయే రోజులలో వర్షాల పరిమాణం మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రైతాంగం, ప్రజలు అధికారిక వాతావరణ హెచ్చరికలను గమనిస్తూ అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

# ఐఐఐటీ జంక్షన్, డీఎల్ఎఫ్ కారిడార్ అభివృద్ధి పనులను పరిశీలించిన సైబరాబాద్ సీపీ..ఏం రమేష్

-మూడు నెలల పాటు ప్రత్యేక ట్రాఫిక్ అడ్వైజరీ అమలు, ప్రత్యామ్నాయ మార్గాలు వినియోగించాలని సూచన-నిర్ణీత గడవలో పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు



సైబరాబాద్, జూన్ 9 : గచ్చిబౌలి పరిధిలోని ఐఐఐటీ జంక్షన్ వద్ద కొనసాగుతున్న రహదారి అభివృద్ధి, ఫ్లైఓవర్ నిర్మాణ పనులను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ నుంచి డీఎల్ఎఫ్ జంక్షన్ వరకు చేపడుతున్న ఫ్లైఓవర్ నిర్మాణం, రహదారి విస్తరణ పనుల పురోగతిని సమీక్షించారు. శేరిలింగంపల్లి ఏడీసీపీ హనుమంతరావు, సిఎంసి అధికారులతో కలిసి నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించిన సీపీ, పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల కారణంగా ప్రజలకు కలిగే ఇబ్బందులను తగ్గించేందుకు ట్రాఫిక్ నిర్వహణ, ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటు, భద్రతా చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ..నిర్మాణ పనుల నేపథ్యంలో రాబోయే మూడు నెలల పాటు ప్రత్యేక ట్రాఫిక్ అడ్వైజరీ అమలు చేయనున్నట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాలలో ట్రాఫిక్ డైవర్షన్లు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను సులభతరం చేసే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల సూచనలను పాటిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. రహదారి అభివృద్ధి, ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం గచ్చిబౌలి, డీఎల్ఎఫ్ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని సీపీ పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో గచ్చిబౌలి ట్రాఫిక్ ఎస్‌హెచ్ఓ సురేష్, సిఎంసి అధికారులు, ట్రాఫిక్ పోలీసు అధికారులు, ఇతర సంబంధిత శాఖల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట.. బోయిని అనూష మహేష్ యాదవ్

-రాష్ట్రానికి వేల కోట్ల రహదారి, హైవే ప్రాజెక్టులు మంజూరు చేసిన కేంద్రం

-కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలి..బోయిన మహేష్ యాదవ్



హైదరాబాద్, జూన్ 9 : కేంద్రంలో భారతీయ జనతా పార్టీ వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆమోదం తెలిపిందని హఫీజ్‌పేట్ బీజేపీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ బోయిని అనూష మహేష్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 435.29 కిలోమీటర్ల రాష్ట్ర రహదారుల అభివృద్ధికి సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సిఆర్ ఐఎఫ్) కింద సుమారు రూ.850 కోట్లకు పైగా నిధులను మంజూరు చేసిందని తెలిపారు. అలాగే నల్గొండ జిల్లాలోని జాతీయ రహదారి-565 బైపాస్ నిర్మాణానికి రూ.516 కోట్ల వ్యయంతో అనుమతి లభించిందని పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా 190 కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.7,600 కోట్ల వ్యయంతో ఆమోదముద్ర వేసిందని ఆమె వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధికి కూడా దోహదపడతాయని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్నప్పటికీ ప్రజలకు చెప్పుకోదగ్గ అభివృద్ధి కార్యక్రమాలు ఏవి చేపట్టిందో వివరించాలని బోయిని అనూష మహేష్ యాదవ్ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం సహకరిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. ప్రజల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, రహదారుల విస్తరణ, పారిశ్రామిక ప్రగతి కోసం కేంద్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, తెలంగాణ అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న సహకారాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ప్రాజెక్టులను త్వరితగతిన అమలు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆమె కోరారు.

# 131 డివిజన్ మాణిక్య నగర్‌లో వి ఎం ఎస్ హంటర్ షూటోకన్ కరాటే అసోసియేషన్ వారి ఆహ్వానం

మేరకు నిర్వహించిన కరాటే ఇన్స్టిట్యూట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు జాలిగం రాకేష్ పాల్గొన్నారు.





కుత్బుల్లాపూర్ జూన్ 09 : 131 డివిజన్ మాణిక్య నగర్‌లో వి ఎం ఎస్ హంటర్ షూటోకన్ కరాటే అసోసియేషన్ వారి ఆహ్వానం మేరకు నిర్వహించిన కరాటే ఇన్స్టిట్యూట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు జాలిగం రాకేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కరాటే శిక్షణ కేంద్రం యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. క్రీడలు మరియు మార్షల్ ఆర్ట్స్ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కాలనీ సభ్యులు,సంస్థ ప్రతినిధులు, శిక్షకులు, క్రీడాకారులు మరియు స్థానికులు పాల్గొన్నారు.జాలిగం రాకేష్ ఉద్యమకారులు/బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుత్బుల్లాపూర్

# పాపిరెడ్డి కాలనీ ప్రాంతాలకు వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలి

-హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించిన

-బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మారబోయిన..రవి యాదవ్

-బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా కాలనీ వాసులు



శేరిలింగంపల్లి, జూన్ 9 : శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పాపిరెడ్డి కాలనీ, ఆర్‌జీకే కాలనీ, సురభి కాలనీ, ఆరంభ్ టౌన్‌షిప్ ప్రాంతాలకు వెంటనే ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ నాయకుడు మరబోయిన రవి యాదవ్ స్థానిక ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మరబోయిన రవి యాదవ్ మాట్లాడుతూ..ఆయా ప్రాంతాలలో వేలాది మంది ప్రజలు నివాసం ఉంటున్నప్పటికీ సరైన ప్రజా రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉద్యోగాలకు వెళ్లే కార్మికులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ప్రతిరోజూ ప్రయాణ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లు అధిక ఛార్జీలు వసూలు చేయడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా హౌస్‌కీపింగ్, సెక్యూరిటీ, ప్రైవేట్ ఉద్యోగాలలో పనిచేసే కార్మికులు తమ సంపాదనలో గణనీయమైన భాగాన్ని ప్రయాణ ఖర్చులకే వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే బస్సు సర్వీసులను ప్రారంభించాలని ఆర్టీసీ అధికారులను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం కొనసాగితే ప్రజల తరఫున బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, బస్సు సౌకర్యం కోసం బీఆర్ఎస్ పార్టీ వెనుకడుగు వేయదని రవి యాదవ్ స్పష్టం చేశారు.

## కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ కు మరో అసంతృప్తి సెగ



బెంగళూరు : మంత్రి రామలింగా రెడ్డి వ్యవహారం నుండి గట్టెక్కారనుకున్న తరుణంలోనే .. కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ కి మరో అసంతృప్తి సెగ ఎదురైంది. శాఖల కేటాయింపుపై అసంతృప్తితో ఉన్న ఇద్దరు నేతలు కాంగ్రెస్ అధిష్టానంతో చర్చల కోసం ఢిల్లీకి బయలుదేరినట్లు తెలుస్తోంది. కృష్ణబేరె గౌడకు గ్రేటర్ బెంగళూరు అభివృద్ధి శాఖను కేటాయించారు. అయితే, ఆ శాఖలోని బెంగళూరు అభివృద్ధి అథారిటీ (బిడిఎ), బెంగళూరు మెట్రోపాలిటన్ ప్రాంత అభివృద్ధి అథారిటీ (బిఎంఆర్ డిఎ) వంటి కీలక విభాగాలను మాత్రం సిఎం తన వద్దే ఉంచుకున్నారు. దీనిపై కృష్ణ బేరె అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ఈ సమస్య పూర్తిగా పరిష్కారమైన తర్వాతే ఆ శాఖ బాధ్యతలు చేపడతానని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. సోమవారం రాత్రి ఆయన ఢిల్లీకి బయలుదేరి వెళ్లినట్లు సమాచారం. కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలతో ఆయన భేటీ కానున్నారు. గౌడతో పాటు ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ కూడా ఢిల్లీ వెళ్లినట్లు సమాచారం. ఇటీవల నగరాభివృద్ధి శాఖను కేటాయించడంపై రామలింగారెడ్డి అలకబూనిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆ నగరాభివృద్ధి శాఖ పైనే కృష్ణ బేరె అసంతృప్తిగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ సోమవారం మాజీ మంత్రులు జగదీష్ షెట్టర్, డి.వి. సదానంద గౌడలతో సమావేశమైనట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అలాగే రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి సీనియర్ నాయకులతో చర్చలు జరిపినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి.

## విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాద బాధితులకు రూ.25 లక్షల పరిహారం


### కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం

### కేంద్ర మంత్రి కుమారస్వామి




ప్రజాశక్తి-విశాఖ : విశాఖ ఉక్కు కర్మాగారంలోని ఆర్‌అండ్‌ఎల్ ప్లాంట్‌లో సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాద స్థలాన్ని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు,ఎంపీ భరత్, హోం మంత్రి వంగలపూడి అనితతో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కేంద్ర మంత్రి కుమారస్వామి, ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగుల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలకు చట్టబద్ధంగా వచ్చే బీమా, పీఎఫ్, గ్రాట్యుటీ ప్రయోజనాలకు అదనంగా రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని, అలాగే బాధిత కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగంతో పాటు వారి పిల్లలకు పూర్తి ఉచిత విద్యా సదుపాయం కల్పిస్తామని ప్రకటించారు. బాధితులు ప్రస్తుతం నివసిస్తున్న స్టీల్ ప్లాంట్ క్వార్టర్లలోనే కొనసాగేందుకు అనుమతి ఇస్తామని స్పష్టం చేశారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా విచారం వ్యక్తం చేస్తూ, పీఎంఎన్ఆర్ఎఫ్ ద్వారా మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల ఆర్థిక సహాయం ప్రకటించారని మంత్రి తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను విశ్లేషించేందుకు ఇతర ఉక్కు కర్మాగారాల నిపుణులతో ప్రత్యేక విచారణ కమిటీని నియమించామని, వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పిస్తారని పేర్కొన్నారు.

## పలు జిల్లాల్లో భారీ వర్షాలు.. మండుతున్న ఎండలు



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో రానున్న 24 గంటల్లో భిన్నమైన వాతావరణం నెలకొననుంది. ఒకవైపు పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉండగా, మరోవైపు కొన్ని ప్రాంతాల్లో ఎండలు మండిపోతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే అల్లూరి సీతారామరాజు, మార్కాపురం జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తరు వానలు, మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా జల్లులు పడవచ్చని తెలిపారు. ఈ నేపథ్యంలో వర్షం పడే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్ కింద నిలబడవద్దని విపత్తు నిర్వహణ శాఖ సూచించింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, పోలవరం, ఏలూరు జిల్లాలలో మాత్రం భానుడి ప్రతాపం కొనసాగనుందని తెలిపారు. అక్కడ గరిష్టంగా 42ళీజ నుంచి 43ళీజ వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఉమ్మడి గోదావరి, కృష్ణా, గుంటూరు, విశాఖ సహా పలు కోస్తా జిల్లాల్లో కూడా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు.

## దుబాయ్‌లో ఏడుగురు భారతీయ కార్మికులు దుర్మరణం



దుబాయ్‌లో జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు భారతీయ కార్మికులు దుర్మరణం పాలవగా, మరో తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. సాంకేతిక లోపం కారణంగా రోడ్డు మధ్యలో నిలిచిపోయిన ఒక ట్రక్కును, కార్మికులతో వెళ్తున్న మినీబస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అక్కడి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ట్రక్కు అకస్మాత్తుగా ఆగడం, అదే సమయంలో మినీబస్సు డ్రైవర్ వెనుక ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు. గాయపడిన తొమ్మిది మందిని స్థానిక ఆస్పత్రికి తరలించగా, వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఈ ఘటనపై దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. భారత అధికారులు ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారని, మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తూ స్థానిక అధికారుల సహాయంతో అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు 'ఎక్స్' ద్వారా వెల్లడించారు.

# గాడ్జిల్లా వచ్చేస్తోంది! భారత్‌పై దాని నీడ పడితే..



పశ్చిమాసియా సంక్షోభంలో సంయమనం పాటించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదే పదే కోరుతున్నారు. కానీ, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం తన దారి తనదేనన్నట్లు వ్యవహరిస్తున్నారు. లెబనాన్ రాజధాని బీరూట్‌పై దాడులతో మళ్లీ యుద్ధాన్ని మొదలుపెట్టినంత పని చేశారు. ఇది శాంతి ప్రయత్నాల్లో ఉన్న ట్రంప్‌నకు సాధారణంగానే చిర్రెత్తుకొచ్చేలా చేసింది. ఒకవైపు తాను కాల్పుల విరమణ కోరుతూ ఇరాన్‌తో ఒప్పందం కోసం ప్రయత్నిస్తుంటే.. ఇజ్రాయెల్ ప్రధాని మాత్రం కవ్వింపు చర్యలకు దిగడాన్ని ట్రంప్ ఏమాత్రం తట్టుకోలేకపోతున్నారు. ఈ మధ్య కాలంలోనే వీళ్లిద్దరి మధ్య వాడివేడి సంభాషణలు జరిగినట్లు.. అందులో ట్రంప్ నెతన్యాహును చెడామడా వాయించినట్లు అమెరికా మీడియా వరుసబెట్టి కథనాలు ఇస్తోంది. అయితే ఇజ్రాయెల్ మాత్రం ఆ స్థాయిలో తిట్టనేలేదని.. సున్నితంగా మందలించారనే అంటోంది. ఈ క్రమంలో మంచి స్నేహాన్ని చెడగొట్టుకుంటూ.. 'ఒంటరి అయిపోతావ్ జాగ్రత్త!' అని హెచ్చరించేదాకా నెతన్యాహు ఎందుకు తెచ్చుకుంటున్నారు అనేది పరిశీలిస్తే.. ఇరాన్‌పై మరోసారి దాడులకు ఆదేశించడం అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. పైకి చూస్తే ఇది కేవలం హెజ్బొల్లా కోసమో, ప్రతీకారం కోసమో చేసిన దాడిలా కనిపించినా.. అసలు లక్ష్యం మాత్రం వేరే ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా-ఇరాన్ శాంతి చర్చల్లో ఇజ్రాయెల్‌కు ప్రాధాన్యం దక్కేలా ఒత్తిడి తీసుకురావడమేనని చెబుతున్నారు. లెబనాన్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ క్షిపణులు ప్రయోగించింది. దీంతో ఏప్రిల్‌లో కుదిరిన కాల్పుల విరమణ తర్వాత తొలిసారిగా ఇజ్రాయెల్ నేరుగా ఇరాన్ లక్ష్యాలపై దాడులు చేసినట్లయ్యింది. అయితే ట్రంప్ జోక్యంతో ఇరుదేశాలు తాత్కాలికంగా కాల్పులు నిలిపివేశాయి. ప్రస్తుతం అమెరికా, ఇరాన్‌తో శాంతి ఒప్పందం కోసం చర్చలు జరుపుతోంది. కానీ, ఆ చర్చల నుంచి ఇజ్రాయెల్‌ను తొలి నుంచే దూరంగా ఉంచినట్లు.. ట్రంప్ వ్యవహార శైలిని బట్టి ఇట్టే అర్థమవుతోంది. ఈ నేపథ్యంలో "మా ప్రయోజనాలను పట్టించుకోకుండా ఎలాంటి తుది ఒప్పందమూ సాధ్యం కాదు" అనే సంకేతాన్ని వాషింగ్టన్‌కు పంపేందుకే నెతన్యాహు ఈ పరిమిత దాడులకు ఆదేశించి ఉంటారని చర్చ నడుస్తోంది. ఇది మాత్రమే కాదు. ఇజ్రాయెల్‌కు అత్యంత కీలకమైన అంశం.. దక్షిణ లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై దాడులు జరిపే స్వేచ్ఛ. ఒకవేళ భవిష్యత్తులో అమెరికా-ఇరాన్ ఒప్పందం కుదిరితే.. ఆ సైనిక చర్యలకు అవకాశమే ఉండకపోవచ్చు అని ఇజ్రాయెల్ భావిస్తోంది. అందుకే ఇరాన్ దాడులకు నేరుగా ప్రతిస్పందించి, "లెబనాన్‌లో మా చర్యలకు ఇరాన్ జోక్యం అంగీకరించం" అనే గట్టి సందేశాన్ని పంపింది. ఇక.. కాల్పుల విరమణ నేపథ్యంలో ట్రంప్, నెతన్యాహూ మధ్య విభేదాలు కొంతకాలంగా బయటపడుతున్నాయి. గత వారం బీరూట్‌పై జరగాల్సిన వైమానిక దాడులను ట్రంప్ ఫోన్ చేయడంతో నెతన్యాహూ నిలిపివేశారు. శాంతి చర్చలు దెబ్బతినకుండా ఉండాలన్నదే ట్రంప్ ఉద్దేశం. అయితే ఇజ్రాయెల్‌లో ప్రతిపక్షాలు మాత్రం "అమెరికా చర్చల కోసం దేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెడుతున్నారా?" అంటూ నెతన్యాహూపై విమర్శలు గుప్పిస్తున్నాయి.

స్వదేశం నుంచి ఈ ఒత్తిళ్లు కూడా నెతన్యాహును దాడులకు ఆదేశించి ఉండొచ్చన్న వాదన ఒకటి వినిపిస్తోంది. సైనిక నిపుణులు చెబుతోంది ఏంటంటే.. ఇజ్రాయెల్ ఒంటరిగా ఇరాన్‌పై దాడులు చేయగలిగినా దీర్ఘకాలిక యుద్ధాన్ని కొనసాగించే సీన్ మాత్రం లేదు. ఆయుధాలు, మందుగుండు సామగ్రి, రక్షణ వ్యవస్థల కోసం అమెరికా సహకారం కీలకం. అందువల్ల ట్రంప్‌తో పూర్తిగా విభేదించే పరిస్థితి కూడా ఇజ్రాయెల్‌కు లేదని విశ్లేషకులు చెబుతున్నారు. ఇరాన్‌పై తాజా దాడులు కేవలం సైనిక చర్యలు మాత్రమే కాదు. అమెరికా-ఇరాన్ శాంతి చర్చల్లో ఇజ్రాయెల్ ప్రయోజనాలను విస్మరించవద్దనే రాజకీయ హెచ్చరికగా విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ట్రంప్ శాంతి ప్రయత్నాలు, నెతన్యాహూ భద్రతా ఆందోళనల మధ్య ఈ సమీకరణం భవిష్యత్తులో మరింత సంక్లిష్టంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# టీఎంసీ అంతర్విస్ఫోటనం!




ఎన్నికల ఫలితాలు వెలువడి పట్టుమని పాతిక రోజులు కాకుండానే తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(టీఎంసీ)కి వీధుల్లో హింసతో మొదలైన ఎదురుదెబ్బలు ఇంకా ఆగలేదు. తాజాగా ఇండియా కూటమి సమావేశానికి ఆ పార్టీ అధినేత మమతా బెనర్జీ ఢిల్లీ వచ్చిన సోమవారం నాడే ఆ పార్టీకి చెందిన 20 మంది ఎంపీలు తిరుగుబాటు జెండా ఎగరేసి, తమదే అసలైన టీఎంసీ అనీ, ఎన్డీయేలో ఉంటామనీ స్పీకర్‌కు లేఖ రాశారు. వారి సంఖ్య 13 మాత్రమేనని పార్టీ చెబుతోంది. ఇప్పటికే టీఎంసీ శాసనసభా పక్షం చీలి, 58 మంది ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ నాయకత్వంలో వేరు కుంపటి పెట్టారు. తమనే ప్రధాన ప్రతి పక్షంగా గుర్తించమని స్పీకర్‌కు లేఖ రాశారు. స్థానిక సంస్థల్లో రాజీనామాలకూ, గోడ దూకుళ్లకూ కొదవే లేదు. 'స్ట్రీట్ ఫైటర్'గా పేరున్న మమత ఈ అరాచకాన్ని ఆపడానికి ప్రయత్నించకపోలేదు. కానీ అదేమీ ఫలితమివ్వలేదని తాజా పరిణామాలు చెబు తున్నాయి. ఫిరాయింపులనగానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన 'వైస్రాయ్ ఎపిసోడ్' అందరికీ గుర్తొస్తుంది. కానీ ఆ జాడ్యం 'వైస్రాయ్' కన్నా చాలా పాతది. 1967లో హరియాణాలో గయాలాల్ అనే స్వతంత్ర శాసనసభ్యుడు వారం రోజుల వ్యవధిలో మూడు పార్టీలు మారినప్పుడు 'ఆయా రాం... గయారాం' అనే నానుడి మొదలైంది. ఫిరాయింపులకు ఆయన ఆద్యుడు కాకపోవచ్చుగానీ, వాటితో ఆయన పేరు శాశ్వతంగా ముడిపడి పోయింది. కానీ గత రెండు దశాబ్దాలనుంచి గుంపుగా వెళ్లి అవతలి పార్టీతో అంటకాగే ఉదంతాలు లేదా సొంత పార్టీ పెట్టుకోవడం వంటివి చోటుచేసుకున్నప్పుడల్లా... ప్రభుత్వాలు కుప్ప కూలినప్పుడల్లా ఆ పాత నానుడి పోయి, 'వైస్రాయ్ ఎపిసోడ్' గుర్తుకురావటం మొదలైంది. 1995లో జరిగిన ఆ ఉదంతం వెన్నుపోటుకూ, విద్రోహా నికీ, నయవంచనకూ బండగుర్తుగా మారిపోయింది. తన మామ స్వర్గీయ ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా జిల్లా పర్యటనలో ఉండగా, ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి, అప్పటి రెవెన్యూ మంత్రి చంద్రబాబు తన విధేయులైన అరడజను మంది ఎమ్మెల్యేలను వైస్రాయ్ హోటల్‌లో పోగేసి, టీడీపీ చీలిపోయిందంటూ బ్రహ్మాండం బద్దలయిన స్థాయిలో అనుకూల మీడియాలో ప్రచారం చేయించుకుని, ఎమ్మెల్యేలను మభ్యపెట్టి, బ్లాక్‌మెయిల్ చేసి ఆ సంఖ్యను పెంచుకుంటూ పోయారు. ఆయన మిత్రుడు, నాటి స్పీకర్ యనమల రామకృష్ణుడు సరేసరి... సకల వ్యవస్థలూ చంద్రబాబుకు సాగిలపడటంతో ఎన్టీఆర్ అధికారాన్ని కోల్పోయారు. కొన్ని నెలల వ్యవధిలోనే మనోవ్యథతో కన్ను మూశారు. ఇప్పటి 'రెడ్‌బుక్'లా ఆ ఉదంతానికి బాబు పేరెట్టినట్టు లేరుగానీ... ఈనాటికీ సకల రాష్ట్రాల ఫిరాయింపుదార్లకూ అదే శిరోధార్యం. 2014లో 23 మంది ఎమ్మెల్యేలను ఖరీదు చేయటం సంగతలా ఉంచి... 2024లో ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్ అధికారం నుంచి వైదొలగాక కొందరు ఎంపీలతో పార్టీకీ, పదవికీ రాజీనామాలు చేయించటంద్వారా మళ్లీ ఆయనే 'నైతికత' ముసుగులో కొత్త రకం చీడకు గేట్లు తెరిచారు. మహారాష్ట్రలో 2022లో ఫిరాయింపులతో శివసేన, ఎన్సీపీలు చతికిలబడి అప్పటి మహావికాస్ అఘాదీ(ఎంవీఏ) ప్రభుత్వం కుప్పకూలింది. ఇప్పుడు విపక్షంలో ఉన్నా టీఎంసీకి అదే దుఃస్థితి ఎదురైంది. ఇదంతా మమత స్వీయ తప్పిదాల ఫలితమా... బీజేపీ చూపే ఆకర్షణల వల్లనా అని చర్చించటం వృథా. రెండూ నిజమే కావొచ్చు. కానీ మమత తప్పిదాలుంటే అవి ఇప్పుడే గుర్తుకురావటం, బీజేపీ ఆకర్షణలు చూపితే పార్టీ అధికారం కోల్పోయాకే ఎగబడటం వింత. గత నెల 4న వెలువడ్డ ఫలితాల్లో 45.92 శాతం ఓట్లతో, 208 సీట్లతో బీజేపీ అధికారంలోకి రాగా... 40.68 శాతం ఓట్లు, 80 సీట్లతో తృణమూల్ అధికారం కోల్పోయింది. అంటే ఓట్లపరంగా పెద్ద వ్యత్యాసం లేదు. కానీ టీఎంసీ ఎమ్మె ల్యేలూ, ఎంపీల్లో ఎంత అభద్రతాభావం! ఈ బాపతు ఫిరాయింపుల్ని అలా గోడదూకే వారిలో లోపించిన నైతికతగా మాత్రమే చూడటం సరికాదు. ఈ వికృత ధోరణుల్ని నిలదీసే కాలంపోయి... ఘనకార్యాలుగా, 'అపర చాణక్యం'గా అభివర్ణించే మీడియా వచ్చింది. ఇతర వ్యవస్థలూ తమకేమీ తెలియనట్టు నటిస్తున్నాయి. అందుకే ఈ గోడ దూకుళ్లు నిర్లజ్జగా సాగిపోతున్నాయి. కనుక పార్టీలు చీలిపోతే... ప్రభుత్వాలు పడిపోతే 'యూ టూ బ్రూటస్' అనుకుని ఆశ్చర్యపోవటం తప్ప ఎవరూ చేయగలిగింది లేదు.


# మరో ఆర్థిక అరాచకం




ఆర్థిక కుంభకోణాలు ఎంత చాకచక్యంగా చక్కబెట్టవచ్చో 'లక్కీ భాస్కర్' మూవీలో చూపించారు. 1980లనాటి షేర్ల స్కామ్ కింగ్ పిన్ బిగ్‌బుల్ హర్షద్ మెహతా జీవితం ఈ సినిమాకు కథా వస్తువు. వ్యవస్థలోని లొసుగులను తమకు అనుకూలంగా మార్చుకొంటున్న పలువురు భారీ అక్రమాలకు బరితెగిస్తున్నారు. వారి చేతుల్లో ఎంతోమంది అమాయకులు మోసపోతున్నారు. తాజాగా బెంగళూరుకు చెందిన ప్రముఖ బంగారం, ఆభరణాల దిగ్గజం రాజేష్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ (ఆర్ఇఎల్) భారీ ఆర్థిక అరాచకం దేశంలోనే కాదు అంతర్జాతీయ కార్పొరేట్ రంగాన్ని షేక్ చేస్తోంది. తన వాస్తవ ఆదాయాన్ని రూ.15.15 లక్షల కోట్లు అధికంగా చూపించి, తన షేర్ వాల్యూను భారీగా పెంచుకొని, మదుపరులను, అలాగే ప్రభుత్వ వ్యవస్థలను మోసగించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (సెబి) స్వయంగా 109 పేజీల నివేదికతో గురువారం బహిర్గతం చేసింది. ఆర్ఇఎల్ కంపెనీ ప్రమోటర్, ప్రస్తుత ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన రాజేష్ మెహతాను సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి తాత్కాలికంగా నిషేధించింది. ఆర్ఇఎల్ అక్రమాలను కేంద్ర ప్రభుత్వ సంస్థలుకానీ, నిఘా విభాగాలు కానీ గుర్తించలేదు. ఒక సాధారణ ఇన్వెస్టర్ 2025లో ఇ-మెయిల్‌లో చేసిన ఫిర్యాదుతో తీగ లాగితే డొంక కదిలింది. సెబి రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టినా, కంపెనీకి సంబంధించిన ఆడిట్ రిపోర్టులను చూపించమని పలు మార్లు నోటీసులిచ్చినా ఆర్ఇఎల్ యాజమాన్యం సహకరించలేదు. అందుకే సెబి ఆ సంస్థ స్కాంపై నివేదిక వెల్లడించాల్సి వచ్చింది. కార్పొరేట్ స్కాంలన్నింటిలో దండలో దారంలో కనిపించేది విదేశాల్లో ఆ సంస్థలు ఏర్పాటు చేసే అనుబంధ షెల్, సూట్‌కేస్ కంపెనీలు, వాటి ద్వారా ఈ దేశంలో అక్రమాలు. ఆర్ఇఎల్ కూడా అదే చేసింది. సిట్జర్లాండ్ నుంచి కథ నడిపించింది. ప్రపంచంలోనే అతిపెద్ద గోల్డ్ రిఫయినరీ 'వాల్కంబీ'ని 2015లో కొనుగోలు చేసింది. సంస్థ ఆదాయాన్ని రూ.వందల కోట్లను వేలు లక్షల కోట్లుగా తప్పుడు పద్ధతుల్లో చూపించింది. సంస్థ సి.ఎం.డి. రాజేష్ మెహతా తన వ్యక్తిగత ఖాతాలకు సంస్థ నిధులను భారీగా నిబంధనలకు విరుద్ధంగా మళ్లించారు. సంస్థలో కీలక స్థానాల్లో ఉన్న మరి కొంత మంది సైతం ఇదే పని చేశారు. ఈ కఠోర విషయాలను సెబినే వెల్లడించింది. కంపెనీ కార్పొరేట్ గవర్నెన్స్ లోపభూయిష్టంగా ఉందని ఇప్పుడు గుర్తించడం ప్రభుత్వ వ్యవస్థల పనితీరులో డొల్లతనానికి నిదర్శనం. ఆర్ఇఎల్ స్కాం దేశ కార్పొరేట్ చరిత్రలో అతిపెద్ద కుంభకోణంగా చెబుతున్నారు. ఇలాంటి స్కామే 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సత్యం కంపెనీలో జరిగింది. రూ.7,800 కోట్ల మేర కంపెనీ బ్యాలెన్స్‌షీట్‌లో తేడా వచ్చింది. ఎక్కువ ఆదాయం చూపించి సత్యం కంపెనీ షేర్ విలువను పెంచుకుందని ఆరోపణలొచ్చాయి. ఈ కేసులో సత్యం కంపెనీ అధినేత రామలింగరాజుకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ అదానీ కంపెనీ ఆర్థిక మోసాలను ఆధారాలతో సహా 2003 జనవరిలో బయటపెట్టడం పెను సంచలనం అయింది. ఆదానీ గ్రూపు తమ షేర్ విలువను పెంచుకునేందుకు గ్రూపు ఆదాయాన్ని అధికంగా చూపించడంతోపాటు పలు ఆర్థిక అవకతవకలకు పాల్పడిందన్నది ప్రధాన అభియోగం. దాంతో అదానీ ఆర్థిక సామ్రాజ్యం రూ.లక్షల కోట్ల మేర పతనమైంది. తూతూ మంత్రంగా సెబి దర్యాప్తు సాగింది. చివరికి అదానీ గ్రూపుపై 'హిండెన్‌బర్గ్'వి ఆధారాల్లేని ఆరోపణలుగా కొట్టిపారేసింది. మోడీ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి భారత్‌పై వాణిజ్య దాడిగా కుహనా జాతీయవాదాన్ని లేపి అదానీపై ఈగ వాలకుండా చూసుకుంది. నయా-ఉదారవాద ఆర్థిక విధానాలే ఆర్థిక స్కాంలకు మూలం. ఆ విధానాలను మోడీ ప్రభుత్వం దూకుడుగా అమలు చేస్తుంది. స్కాంలు అనివార్యం. 'లక్కీ భాస్కర్లు' పుట్టుకొస్తూనే ఉంటారు. నష్టపోయేది సామాన్య ప్రజలే! అప్రమత్తం వహించాల్సింది ప్రజలే!!

# ముచ్చటైన మరో మూడు పక్షులు





## పసుపు చెంప పిట్ట , పసుపు గొంతు బుల్‌బుల్ పిట్ట , లీసెర్ విజిలింగ్ డక్ బేబీ

## శేషాచల అడవుల్లో గుర్తించిన గరుడ అట్లాస్ బృందం

## తిరుపతి ప్రాంతంలో ఇప్పటివరకు 274 పక్షిజాతుల గుర్తింపు

తిరుపతి సిటీ: తిరుపతి శేషాచల అడవుల్లో తిరుపతి నేచర్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ సహకారంతో మరో మూడు అరుదైన పక్షి జాతుల్ని గుర్తించినట్టు గరుడ అట్లాస్ బృందం ఆదివారం వెల్లడించింది. తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐజర్) బృందంతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 50 మంది పరిశోధకులు పక్షిజాతుల గణన, వాటి వైవిధ్యం, మనుగడ, జీవన విధానంపై ప్రత్యేక సర్వే చేపట్టారు. 2022లో ఏర్పడిన తిరుపతి బర్డ్ అట్లాస్ ఇటీవల గరుడ అట్లాస్‌గా పేరు మార్చుకుని తిరుపతి పరిసర ప్రాంతాల్లోనూ, శేషాచల అడవుల్లోనూ సంచరించే పక్షిజాతుల డేటాను సేకరించేందుకు శ్రీకారం చుట్టింది. విడతల వారీగా అటవీ ప్రాంతాలలో సర్వే చేపట్టి అరుదైన పక్షి జాతులను గరుడ అట్లాస్ బృందాలు కెమెరాల్లో బంధిస్తున్నాయి. తిరుపతి ప్రాంతంలో తొలిసారిగా పసుపు చెంప పిట్ట (ఇండియన్ ఎల్లో టిట్) అనే అరుదైన పక్షిని కనిపెట్టామని గరుడ అట్లాస్ ప్రతినిధులు చెప్పారు. వీటితో పాటు పసుపు గొంతు బుల్‌బుల్ పిట్ట (ఎల్లో థ్రోటెడ్ బుల్‌బుల్), లీసెర్ విజిలింగ్ డక్ బేబీ వంటి అరుదైన పక్షిజాతులు తిరుపతి ప్రాంతంలో ఉండటం విశేషమన్నారు. కొండలపై నివసించే రాప్టర్ ఐన్ షాహీన్ ఫాల్కన్ పక్షులు సైతం తిరుమల ఘాట్ రోడ్డులో ఆవాసాలు ఏర్పాటు చేసుకోవడం హర్షణీయమని తెలిపారు.

ఇప్పటివరకు 274 పక్షిజాతుల గుర్తింపు

మానవ సమాజంతో పక్షిజాతుల అనుబంధాన్ని బలోపేతం చేసేందుకు ఈ సర్వే చేపట్టినట్లు ఐజర్ బృందంలో పరిశోధకుడైన హరీష్ పేర్కొన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. తమ బృందాలు ఇప్పటివరకు తిరుపతి పరిసర ప్రాంతాల్లో 55 వేల పక్షుల గమనాలను పరిశీలించాయని చెప్పారు. ఇందులో 274 పక్షిజాతులు ప్రకృతిలో మమేకమై ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 5 ఎడిషన్లలో పక్షి జాతుల డేటాను సేకరించామని, వాటిని పూర్తి స్థాయిలో మ్యాపింగ్ చేశామని తెలిపారు. ఆయన వెంట పుష్యామిత్ర, టీఎన్ఎస్ ప్రతినిధి పి రామచంద్రారెడ్డి తదితరులున్నారు.

# దమ్ముంది.. దన్ను కావాలి

## ఇప్పటికైతే మనది 10వ స్థానం

## ఏఐ మేధోనిధి.. ఇండియా!

## మెరికలున్నా సదుపాయాల్లేవు

## నైపుణ్యం ఒక్కటే సరిపోదు

## సూపర్ కంప్యూటర్‌లు... భారీ పెట్టుబడులు అవసరం

## ఏఐ సదస్సు చూపిన 'ఇంపాక్ట్'



ఢిల్లీలో ఐదు రోజుల ఐఏ ఇంపాక్ట్ సదస్సు ఇటీవలే ముగిసింది. ఇండియా ఈ సదస్సును మొదటిసారి నిర్వహించింది. ప్రపంచ దేశాల నాయకులు ఇందులో పాల్గొన్నారు. కొత్త ఆవిష్కరణలపై అంతా దృష్టి పెట్టారు. ఇండియాకైతే ఇది ఒక కీలకమైన సందర్భం. మన ఏఐ వ్యవస్థలో ఉన్న బలాలు, పూరించుకోవలసిన లోట్లను ఈ సదస్సు స్పష్టం చేసింది.

### నిపుణుల సంఖ్యలో రెండో స్థానం

ఏఐ రంగంలో మెరికలు ఉన్న దేశంగా ఇండియా పేరు పొందింది. కానీ మౌలిక సదుపాయాల విషయంలో వెనుకబడి ఉంది. 2024 'టార్టాయిస్ గ్లోబల్ ఏఐ ఇండెక్స్' ప్రకారం, ఏఐ సామర్థ్యంలో ఇండియా ప్రపంచంలో 10వ స్థానంలో ఉంది. ఏఐ నిపుణుల సంఖ్యలో మాత్రం 2వ స్థానంలో నిలిచింది.

### సౌకర్యాలలో 68వ స్థానం

ఏఐ ఆపరేషన్స్‌లో ఇండియా 3వ స్థానంతో మంచి ప్రతిభ కనబరిచింది. అయితే కంప్యూటింగ్ పవర్, ఇతర సౌకర్యాల విషయంలో 68వ స్థానంలో ఉంది. ఈ కారణంగా అమెరికా, చైనాతో పోటీ పడటం భారత్‌కు కష్టం కావచ్చన్న అభిప్రాయం ఏఐ పరిశ్రమంలో వ్యక్తం అవుతోంది.

### ఉన్నది కొన్నే సూపర్ కంప్యూటర్‌లు

ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యంత శక్తివంతమైన 500 సూపర్ కంప్యూటర్లలో ఇండియా వాటా కేవలం 1 శాతం మాత్రమే. అంటే, ఏఐకి కావలసిన కంప్యూటింగ్ సామర్థ్యం మన దగ్గర చాలా తక్కువగా ఉంది. అమెరికా ఈ విషయంలో చాలా ముందుంది. ప్రపంచంలోని మొత్తం సూపర్ కంప్యూటర్లలో 35 శాతం సిస్టమ్‌లు, దాదాపు 48 శాతం కంప్యూటింగ్ సామర్థ్యం అమెరికా దగ్గరే ఉంది.

### ట్రైనింగ్ డేటాలో 3 శాతం వాటా

ఏఐ ట్రైనింగ్ డేటా రంగంలో ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పెట్టుబడులలో భారతదేశం వాటా కేవలం 3 శాతం మాత్రమే. అంటే, మన దేశానికి చాలా తక్కువ పెట్టుబడులు అందుతున్నాయి. ఈ విషయంలో అమెరికా 56 శాతంతో అందరికంటే ముందుంది. ఆ తర్వాత చైనా 17 శాతంతో, ఐరోపా సమాఖ్య దేశాలు 15 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

### ప్రపంచాన్ని శాసించగలమా?

మన దగ్గర అద్భుతమైన తెలివితేటలు కలిగిన నిపుణులు ఉన్నారు. కానీ, ఆ తెలివితేటలకు తగ్గట్టుగా శక్తివంతమైన కంప్యూటర్లు, భారీ పెట్టుబడులు తోడవాల్సి ఉంది. అమెరికా, చైనా వంటి దేశాలతో పోటీ పడాలంటే, కేవలం సాఫ్ట్‌వేర్ నైపుణ్యం మాత్రమే సరిపోదు; సొంతంగా డేటా సెంటర్లు, సూపర్ కంప్యూటర్లను పెంచుకోవాలి. అప్పుడే ఇండియా ఏఐ ప్రపంచాన్ని శాసించ గలుగుతుంది.

**హెచ్.పి.సి. సిస్టమ్ : హై పెర్ఫార్మింగ్ కంప్యూటింగ్ (యంత్ర సామర్థ్యం)**

**హెచ్.పి.సి. కెపాసిటీ : హై పెర్ఫార్మింగ్ కెపాసిటీ (శక్తి సామర్థ్యం)**

**హెచ్.ఐ.సి.: హై ఇన్‌కం కంట్రీస్; యు.ఎం.ఐ.సి.: అప్పర్ మిడిల్ ఇన్‌కం కంట్రీస్**

**ఎల్.ఎం.ఐ. సి. : లోయర్--మిడిల్ ఇన్‌కం కంట్రీస్**

# నేటి పాత స్మార్ట్‌ఫోన్లే... రేపటి ఫైటర్ జెట్లు!

## ఫోన్ల నుంచి అరుదైన మూలకాల వెలికితీతకు యత్నాలు

కొత్త ఫోన్ కొనగానే పాతదానిని చెత్త ఫోన్ అంటూ చెత్తబుట్టలో పడేయడం చాలామందికి అలవాటు. కానీ ఆ పాత ఫోన్‌లో 'రేర్ ఎర్త్ ఎలిమెంట్స్'గా పిలిచే అత్యంత విలువైన భూ అయస్కాంత మూలకాలు అత్యంత సూక్ష్మపరిమాణంలో ఉంటాయి. వాటిని విదేశాల నుంచి వేలాది కోట్లు వెచ్చించి దిగుమతి చేసుకునే బదులు ఈ పాత ఫోన్ల నుంచే సంగ్రహిస్తే? కేంద్రం ఇప్పుడు సరిగ్గా ఇలాంటి ఆలోచనే చేస్తోంది. తద్వారా లక్షల కోట్ల విదేశీమారక ద్రవ్యం ఆదా అవుతుందని భావిస్తోంది! "టన్ను ముడిఖనిజం నుంచి కేవలం ఒకట్రెండు కిలోల కోబాల్ట్ మాత్రమే తీయగలం. అదే టన్ను పాత బ్యాటరీల నుంచి ఏకంగా 50 నుంచి 80 కేజీల దాకా సమీకరించవచ్చు. పైగా ముడిఖనిజ కోబాల్ట్ కంటే ఇది 40 ఎక్కువ గాఢత కలిగి ఉంటుంది" అని గ్రేటర్ నోయిడా కేంద్రంగా పనిచేసే లిథియం--అయాన్ బ్యాటరీ తయారీ సంస్థ 'లోహం' రీసైక్లింగ్ హెడ్ సయ్యద్ గజన్‌ఫర్ అబ్బాస్ సాఫ్వీ చెప్పారు. "ఇప్పటికే ఎంతో శ్రమించి తయారుచేసిన స్మార్ట్‌ఫోన్ వంటి ఈ--వేస్ట్‌లో ఎంతో విలువైన ఖనిజాలుంటాయి. వాటిపై భారత్ ఇప్పటిదాకా సరైన దృష్టి సారించలేదు" అని ఈ--వేస్ట్ మేనేజ్‌మెంట్, లిథియం--అయాన్ బ్యాటరీ కంపెనీ అట్టెరో సహ వ్యవస్థాపకుడు నితిన్ గుప్తా చెప్పారు. యుద్ధ విమానాలు అత్యంత తేలిగ్గా, అత్యంత దృఢంగా ఉండటానికి నియోడైమియం వంటి ఈ మూలకాలే కారణం. వాటిలో ఇంధనం ప్రవాహాలు, రెక్కల కదలికలు, కాక్‌పిట్‌కు కరెంటు సరఫరా చేసే జనరేటర్లను పర్యవేక్షించే సెన్సార్లకు అవే శక్తినందిస్తాయి. "భారత్ ప్రస్తుతం ఈ--వేస్ట్‌ను విదేశాలకు అనవసరంగా ఎగుమతి చేస్తోంది. అలాగాక భారత్‌లోనే భారీగా శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలి. తద్వారా ఈ--వేస్ట్‌లోని భూ అయస్కాంత మూలకాలను సంగ్రహించి యుద్ధ విమానాల తయారీకి సదీ?వనియోగం చేసుకోవచ్చు. అత్యంత అరుదైన ఖనిజాల కోసం చైనా వంటి ప్రత్యర్థి దేశాలపై ఆధారపడే దురవస్థ



తొలగుతుంది" అని ముంబై కేంద్రంగా పనిచేసే శుద్ధ సాంకేతిక సంస్థ 'లీకో' సీఈవో గౌరవ్ దోల్వానీ అన్నారు.

# మనోవేదనను 'మెషీన్' చెప్పేస్తుంది

## వాయిస్ శాంపిల్‌ను చిటికెలో విశ్లేషించి ముందే అప్రమత్తం చేస్తున్న మెషీన్ లెర్నింగ్ మోడల్స్

## తొలిదశలోనే మనోవ్యాధి లక్షణాలను పసిగట్టడంలో దోహదపడుతున్న సాంకేతికత

## తాజా ప్రయోగాల్లో 70 శాతం నుంచి 96 శాతం వరకు కచ్చితత్వంతో ఫలితాలు

## ఢిల్లీ ఎయిమ్స్ చేపట్టినపరిశోధనలో 78 శాతం కచ్చితత్వం నమోదు



ఒకరు చెబుతున్నది నిజమో లేక అబద్ధమో లై డిటెక్టర్ టెస్ట్ చిటికెలో చెప్పేస్తుంది. నాడీ స్పందనలు, బీపీలో హెచ్చుతగ్గులు, శ్వాస తీసుకోవడంలో మార్పులను విశ్లేషించి ఆయా అంశాలను నిర్ధారిస్తుంది. అదే తరహాలో డిప్రెషన్‌ను కేవలం ఒక్క వాయిస్ శాంపిల్‌తో మెషీన్ లెర్నింగ్ చాలా వరకు కచ్చితత్వంతో తొలిదశలోనే గుర్తిస్తోంది! ఈ మేరకు సాగిన అధ్యయనాల్లో ఈ విషయం వెల్లడైంది. సంప్రదాయ చికిత్సా పద్ధతుల్లో డిప్రెషన్‌ను నిర్ధారించేందుకు వైద్యులు రోగులను కొన్ని ప్రశ్నలడిగి వారి భావోద్వేగ పరిస్థితులను అంచనా వేస్తుంటారు. అయితే ఈ పద్ధతిలో బాధితులు వారంతట వారుగా ముందుకొస్తే తప్ప వైద్య సాయం చేసేందుకు వీలు ఉండదు. దీనివల్ల చాలా సందర్భాల్లో బాధితులకు వైద్య సహాయం ఆలస్యం అవుతోంది. కానీ శాస్త్రవేత్తలు ఈ సమస్యను అధిగమించేందుకు ఏఐ సాంకేతికతను తెరపైకి తెచ్చారు. కుంగుబాటుకు గురైన వారి స్వరంలో హెచ్చుతగ్గులను మెషీన్ లెర్నింగ్ అల్గోరిథంల సాయంతో విశ్లేషిస్తున్నారు. కేవలం వాట్సాప్ ఆడియో ఫైల్స్‌ను విశ్లేషించడం ద్వారా డిప్రెషన్ బాధితుల లక్షణాలను 70 శాతం నుంచి 96 శాతం వరకు కచ్చితత్వంతో మెషీన్ లెర్నింగ్ టూల్స్ గుర్తిస్తున్నట్లు ప్రయోగాత్మకంగా నిరూపిస్తున్నారు. 25--30 సెకన్ల ఆడియో ఫైల్‌లోని స్వరంలో హెచ్చుతగ్గులు, వాల్యూమ్, స్పీచ్ రేట్ వంటి శబ్ద లక్షణాలను విశ్లేషించడం ద్వారా ఆయా వ్యక్తుల మనోవ్యథను మెషీన్ లెర్నింగ్ మోడల్స్ గుర్తిస్తున్నట్లు చెబుతున్నారు.

### ఎయిమ్స్‌పరిశోధన ఇలా...

డిప్రెషన్‌ను ముందుగానే గుర్తించడానికి స్పీచ్ అనాలిసిస్ ఒక ఆచరణాత్మక సాధనంగా ఉంటుందా అనే అంశాన్ని పరిశీలించేందుకు ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) పరిశోధన నిర్వహించింది. ఇందులో భాగంగా పరిశోధకులు 423 మంది వాలంటీర్ల నుంచి (ప్రధానంగా 18--25 సంవత్సరాల ఏళ్ల వారు) సంతోషం, బాధలో ఉన్నప్పుడు మాట్లాడిన స్వర నమూనాలను సేకరించి విశ్లేషించారు. ఈ ప్రయోగంలో పాల్గొన్న వాలంటీర్లు వారి క్లినికల్ మానసిక ఆరోగ్య స్థితిని నిర్ధారించుకోవడానికి ప్రామాణిక మానసిక పరీక్షలను కూడా చేయించుకున్నారు. ఈ అధ్యయనంలో వారి స్వరం, స్వర స్థాయి, స్వర శక్తితో సహా వాక్పటిమ, ఉచ్ఛారణ, ఇతర గుర్తులపై పరిశోధకులు దృష్టి సారించారు. దీనిప్రకారం నిరాశతో మాట్లాడిన సందర్భాల్లో వాక్పటిమ, భావోద్వేగ స్వరం, తక్కువ స్వర స్థాయిలను గమనించారు. అలాగే వాయిస్ విశ్లేషణను క్లినికల్ డేటాతో పోల్చినప్పుడు నమూనా నాణ్యతను బట్టి మెషీన్ లెర్నింగ్ మోడల్స్‌దాదాపు 60 శాతం నుంచి 78 శాతం కచ్చితత్వంతో నిస్పృహ లక్షణాలను సరిగ్గా అంచనా వేశాయని గుర్తించారు.

### వాయిస్ నోట్స్ ద్వారా...

పీఎల్‌వోఎస్ మెంటల్ హెల్త్‌లో ప్రచురితమైన మరో నివేదిక ప్రకారం బ్రెజిల్‌కు చెందిన మానసిక వైద్య పరిశోధకుడు విక్టర్ ఒటాని నేతృత్వంలోని పరిశోధకులు... డిప్రెసివ్ డిజార్డర్ లక్షణాలు ఉన్న, అవి లేని వ్యక్తులను వేరు చేయడంలో మెషీన్ లెర్నింగ్ మోడళ్లు సహాయపడతాయా అని పరీక్షించారు. ఈ అధ్యయనంలో పాల్గొన్న వారి నుంచి స్వల్ప వ్యవధిగల వాట్సాప్ వాయిస్ సందేశాలను రికార్డ్ చేశారు. ఆ ఆడియో క్లిప్‌ల నుంచి సేకరించిన శబ్ద లక్షణాలపై ఏడు వేర్వేరు మెషీన్ లెర్నింగ్ నమూనాలు, ప్రామాణిక క్లినికల్ ఇంటర్వ్యూలను ఉపయోగించి కుంగుబాటును నిర్ధారించారు. దీని ప్రకారం ఏఐ నమూనాలు మహిళల్లో 91.67 శాతం వరకు, పురుషులలో 80 శాతం వరకు కచ్చితత్వంతో కుంగుబాటును గుర్తించాయి.


### ఇతర ప్రపంచ అధ్యయనాలు ఏమి చెబుతున్నాయి...

ది యానల్స్ ఆఫ్ ఫ్యామిలీ మెడిసిన్‌లో ప్రచురితమైన మరో అధ్యయనం మాటలు, స్పందనల్లోని నిరాశను గుర్తించడానికి ఏఐ--ఆధారిత వాయిస్ బయోమార్కర్ సాధనాన్ని మూల్యాంకనం చేసింది. మెషీన్ లెర్నింగ్ సాధనం 70 శాతం కంటే ఎక్కువ కేసుల్లో ఆడియో ఫైల్‌ను సమర్పించిన 25 సెకన్లలోనే మోస్తరు నుంచి తీవ్ర నిరాశలో ఉన్న బాధితుల స్వరాలను గుర్తించింది. యూఎస్, కెనడాలోని దాదాపు 15,000 మంది వయోజనుల నుంచి సేకరించిన వాయిస్ రికార్డింగ్‌లను పరిశోధకులు విశ్లేషించి అల్గోరిథం ఇచ్చిన ఫలితాలను ప్రామాణిక డిప్రెషన్ ప్రశ్నపత్రాలతో పోల్చినప్పుడు ఈ మేరకు ఫలితాలు వచ్చాయి. అయితే ఈ విధానం క్లినికల్ డయాగ్నోసిస్‌కు ఏమాత్రం ప్రత్యామ్నాయం కాదని పరిశోధకులు స్పష్టం చేశారు.

# వందలసార్లు చార్జ్ చేసినా... అస్సలు తగ్గని సామర్థ్యం!

## జింక్ అయాన్ బ్యాటరీ ఆవిష్కరణ

## నీటి ఆధారిత మూలకాలతో తయారీ



మనం ప్రస్తుతం వాడుతున్న బ్యాటరీలన్నీ మండే స్వభావమున్న రసాయనాలతో తయారు చేసినవే. వాటికి పూర్తి భిన్నంగా నీటి ఆధారిత అణువులతో రూపొందిన వినూత్న జింక్ అయాన్ బ్యాటరీని సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మెటీరియల్స్ (సీఈఎన్ఎస్) పరిశోధకులు అభివృద్ధి చేశారు. దీంతో పునరుద్పాతక ఇంధన నిల్వ మరింత భద్రంగా, చవగ్గా, విశ్వసనీయంగా మారనుంది. ఈ విధానంలో తయారైన జింక్ అయాన్ బ్యాటరీని 500 సార్లు చార్జ్ చేసి వాడాక కూడా అచ్చం కొత్తదాని మాదిరిగా ఏకంగా 98 శాతం సామర్థ్యంతో పని చేస్తోందని పరిశోధకులు వెల్లడించారు! సౌర ఫలకాలు, విండ్ టర్బైన్ల నుంచి తయారైన విద్యుత్‌ను నిల్వచేసేందుకు దోహదపడే జింక్ భూమిపై చవగ్గా, సులభంగా, విస్తారంగా లభిస్తుంది. బ్యాటరీలో జింక్ ఒకవైపు పొరగా పనికొస్తుంది. మరోవైపు క్యాథోడ్‌గా ఏ మూలకాన్ని వాడాలనేది ఇన్నాళ్లూ సమస్యగానే మిగిలిపోయింది. ఈ సవాలుకు మాలిబ్డినం డైసలై?పడ్‌తో సీఈఎన్ఎస్ శాస్త్రవేత్తలు పరిష్కారం చూపారు. మాలిబ్డినం, సల్ఫర్‌లతో దాన్ని తయారుచేశారు. సల్ఫర్ నుంచి అత్యంత పల్చటి పొరలను అభివృద్ధి చేశారు. అవి శక్తిని నిల్వ చేసుకోవడమే గాక నిరంతరాయంగా సరఫరా కూడా చేయగలవని నిరూపించారు. నియంత్రిత వేడి వ్యవస్థ విధానం ద్వారా దీన్ని సుసాధ్యంచేశారు. దీంతో బ్యాటరీని చార్జ్ చేసినప్పుడు శక్తి సులభంగా లోపలికి వెళ్లడమే గాక అంతే సులభంగా డిశ్చార్జ్ అవుతోంది. భద్రమైన, అత్యంత సుస్థిరమైన ఆపరేటింగ్ పరిమితి అయిన 0.2--1.3 ఓల్ట్ స్థాయిని శాస్త్రవేత్తలు సాధించారు. తద్వారా బ్యాటరీ పాడవకుండా వందలసార్లు చార్జ్ చేసుకుని వాడుకోవచ్చు. చార్జింగ్ అనంతరం వాడే క్రమంలో కేవలం 0.3 శాతం శక్తి మాత్రమే వృథాగా పోతోంది. మిగతాదంతా బ్యాటరీలోనే నిల్వ ఉంటోంది. ఇలా 99.7 శాతం 'కొలంబిక్ ఎఫిషియెన్సీ' సాధించడం విశేషం. ఈ కాయిన్--సెల్ నమూనా బ్యాటరీని ఎల్‌సీడీ టైమర్‌కు చార్జింగ్ పెట్టడం ద్వారా వాణిజ్య స్థాయిలో విజయవంతంగా పరీక్షించారు. ఈ పరిశోధన వివరాలు అమెరికా కెమికల్ సొసైటీ 'ఎనర్జీ అండ్ ఫ్యూయల్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

Printed, Polished, Owned by BESTHA SHIVA RAMUDU & Printed UTTEJITA PRINTERS H.NO -801, BUDHAWAR PETA, KURNOOL, ANDHRA PRADESH - 518001.
APTEL2023/88704 & Published at D.No.4-458, PAIGEAR, NANDAVARAM, V&P. KURNOOLD.T. (A.P)-518343,CELL:9494741301.